సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
ఆదివారం, 08.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 136
పేజీలు: 12 వెల: రూ. 5

టీ20 వరల్డ్‌కప్ ఫైనల్

## భారత్-న్యూజిలాండ్ మధ్య
# విశ్వవిజేత పోరు

- అహ్మదాబాద్ వేదికగా భారత్-న్యూజిలాండ్ మధ్య టైటిల్ సమరం
- ఐసీసీ ఫైనల్స్‌లో కివీస్ పైచేయి.. ప్రతీకారం కోసం టీమిండియా రెడీ
- మూడు ఫార్మాట్ల ఫైనల్స్‌లో తలపడిన తొలి జట్లుగా భారత్-కివీస్ రికార్డు
- డిఫెండింగ్ ఛాంపియన్‌గా సూర్యకుమార్ యాదవ్ సేనకు మరో సవాల్

11




# డేంజర్ బెల్స్
## మార్చి నుంచే వడగాల్పుల తీవ్రత

- డీహైడ్రేషన్ ప్రమాదం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వాతావరణ శాఖ హెచ్చరిక
- 12 రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు
- తెలంగాణలో ఎండల డేంజర్
- 3-5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం బయటకు రావద్దు

09




## తెలంగాణలో ముగిసిన
# అధ్యాయం

130మంది మావోయిస్టుల లొంగుబాటు!

చర్చలే సమస్యల పరిష్కారానికి మార్గం

- గణపతి సహా మావోయిస్టులందరూ లొంగిపోవాలి
- లొంగిపోయిన వారికి అండగా ఉంటాం
- వారికి రక్షణతో పాటు ఆర్థిక, ఇతర సదుపాయాలు
- కేంద్ర హోంశాఖ మంత్రితో చర్చలు జరిపాం
- సీఎం సమక్షంలో 124 అత్యాధునిక ఆయుధాలతో 130 మంది లొంగుబాటు
- తెలంగాణలో మావోయిస్టు రాష్ట్ర కమిటీ లేదని ప్రకటించిన సర్కార్

03

*శాంతియుత జీవనమే సర్వోత్తమమని చాటి చెబుతూ, తెలంగాణ గడ్డపై హింసాత్మక రాజకీయాలకు తెరపడింది. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు 130 మంది మావోయిస్టులు 124 అత్యాధునిక ఆయుధాలతో శనివారం సామూహికంగా లొంగిపోయారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో తెలంగాణలో మావోయిస్టు రాష్ట్ర కమిటీ ఉనికి కోల్పోయిందని డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించగా, లొంగిపోయిన వారికి పూర్తిస్థాయి పునరావాసం, ప్రత్యేక ఆరోగ్య భద్రత కార్డులతో పాటు ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పిస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.*



# రాజ్ భవన్ రహస్యం

## జిష్ణుదేవ్ వర్మ బదిలీ బీజేపీ వ్యూహమా?

తెలంగాణలో గవర్నర్ మార్పుతో రాజకీయాల్లో కొత్త చర్చ

- శివ ప్రతాప్ శుక్లా రాకతో రాజ్‌భవన్ రాజకీయాలు మారతాయా
- రాజ్‌భవన్ - ప్రజాభవన్ మధ్య మళ్లీ ఘర్షణల భయం
- బిల్లులు, నియామకాలపై గవర్నర్ కఠిన వైఖరి అవకాశం
- తెలంగాణలో బీజేపీ బలపడేందుకు వ్యూహాత్మక అడుగులా
- కాంగ్రెస్-బీజేపీ మధ్య ప్రత్యక్ష రాజకీయ పోరాటానికి సంకేతాలు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీ వ్యవహారం ఇంకా కోర్టు చిక్కుల్లోనే
- కోదండరాం, అజారుద్దీన్ పేర్లపై కొత్త గవర్నర్ నిర్ణయం కీలకం
- అజారుద్దీన్ మంత్రి పదవిపై అనిశ్చితి
- కాంగ్రెస్‌లో టెన్షన్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రానికి గవర్నర్లతో వివాదాలు ఆగడం లేదు. తొలి గవర్నర్ నరసింహన్ మినహా.. ఏ గవర్నర్ ఉన్నా.. ఏ ప్రభుత్వం అయినా విభేదాలే ఉంటున్నాయి. కేసీఆర్ ను తమిళిసై సౌందరరాజన్ ఇబ్బందులు పెట్టినట్లుగా ప్రచారం ఉంది. తాజాగా తెలంగాణలో గవర్నర్ ను కేంద్రం అనూహ్యంగా మార్చేసింది. బీజేయేతర ప్రభుత్వాలు ఉన్న చోట్ల గవర్నర్లు ఎలా వ్యవహరిస్తారో దానికి భిన్నంగా జిష్ణుదేవ్ శర్మ వ్యవహరించారు. ప్రభుత్వంతో ఎలాంటి లొల్లి పెట్టుకోలేదు. నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్రంతో ఎలాంటి లొల్లి పెట్టుకోవడం లేదు. రాజకీయంగా విభేదిస్తూనే పాలనా పరంగా కలసి పని చేస్తున్నారు. కానీ ఇప్పుడు గవర్నర్ ను మార్చడంతో.. తమ పంథాలోకి బీజేపీ వెళ్లనుందని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణోల గెలిచి తీరాలనుకుంటున్న బీజేపీ.. గవర్నర్ ద్వారా ఇతర పనులు చక్కబెట్టి పార్టీని దూకుడుగా ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహాన్ని అమలు చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

**ఇప్పటి వరకూ వివాదాస్పదం కాని గవర్నర్**
తెలంగాణ రాజకీయాల్లో గవర్నర్ మార్పు ఒక్కసారిగా ప్రకంపనలు సృష్టించింది. సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్న జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్రకు బదిలీ చేసి, ఆయన స్థానంలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను నియమించడం వెనుక మిగతా 02లో




## మహిళల భద్రతకు
# పురుషులే బ్రాండ్ అంబాసిడర్లు
### స్టాండ్ విత్ హర్‌లో సీఎం



- వారి భద్రత, గౌరవం, సమానత్వాన్ని కాపాడాలి
- మహిళా భద్రత సామాజిక బాధ్యత
- ఆడబిడ్డలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం కావాలి

10



## తెలంగాణ–డెలావేర్
# సహకారానికి కొత్త దిశ
### డెలావేర్ రాష్ట్ర పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

- వైద్యం, విద్య, సాంకేతిక రంగాలపై విస్తృత చర్చ
- సమాచార భద్రత, డేటా ప్రొటెక్షన్ అంశాలపై అభిప్రాయాల మార్పిడి
- పేదల గృహ నిర్మాణ పథకాలపై వివరించిన డెలావేర్ గవర్నర్

09

# ఓరుగల్లుకు మహర్దశ
### గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు రూ. 5,257 కోట్లు

03

- ఆ నిధులతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం
- 50:25:25 శాతం నిధులతో పనులు
- గతంలోనే పూర్తయిన డీపీఆర్



## హెచ్‌డీఎఫ్‌సీ
# శుభవార్త

లోన్ వడ్డీ రేట్లు తగ్గింపు

- మరింత తగ్గనున్న ఈఎంఐ!
- అన్ని టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ 5-10 బేసిస్ పాయింట్లు తగ్గింపు
- మార్చి 7 నుంచి కొత్త వడ్డీ రేట్లు అమల్లోకి
- ఎంసీఎల్ఆర్ లింక్డ్ లోన్లు తీసుకున్న వారికి తగ్గనున్న ఈఎంఐ

10




## ఊరుకుంటేనే
# ఉత్తమం!
### కాంగ్రెస్‌లో సూపర్ పవర్ గా రేవంత్ రెడ్డి

- నరేందర్ రెడ్డికి రాజ్యసభతో రేవంత్ బలం మరోసారి రుజువు
- అసంతృప్త నేతల నోరు మూయించిన వ్యూహాత్మక నిర్ణయం
- ఢిల్లీలో పెరిగిన రేవంత్ ప్రభావం.. సీనియర్లకు షాక్
- గ్రూపు రాజకీయాలకు చెక్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కలహాల కాంగ్రెస్ ఇప్పుడు సైలెంట్ మోడ్ కు వెళ్తోంది. పదవులపై ఎప్పటికీ ఏదో ఒక అసంతృప్తితో ఉండే నేతలు.. ఎప్పుడైనా మీడియా ముందు గొంతు చించుకునే వారంతా ఒక్కసారిగా మూగనోము పాటిస్తున్నారు. ప్రధానంగా సీఎంకు వ్యతిరేకంగా వెళ్లేందుకు వెనకాడుతున్నారు. తాజాగా వేం నరేందర్ రెడ్డి విషయంతో ఇక తిరుగుబాటు నేతలు ఒకే దారికి వచ్చినట్లుగా మారింది. తెలంగాణ మిగతా 02లో

## పశ్చిమాసియా
# రణరంగం

- మెహరాబాద్ విమానాశ్రయం ధ్వంసం
- భారీ ప్రాణనష్టం.. వేలాదిమందిలో భయాందోళనలు
- గల్ఫ్ జలాల్లో అమెరికా యుద్ధ నౌకలు.. ఉద్రిక్తతలు తారాస్థాయికి
- యూఏఈ, సౌదీపై డ్రోన్ ముప్పు.. అప్రమత్తమైన గల్ఫ్ దేశాలు
- అట్టుడుకుతున్న గల్ఫ్ ప్రాంతం



### ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణుల దాడి

**ముద్ర డెస్క్ :**
పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ జరిపిన మెరుపు దాడులు ఆ ప్రాంతంలో పరిస్థితులను ఒక్కసారిగా మార్చేశాయి. కీలకమైన మెహరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు క్షిపణుల వర్షం కురిపించడంతో పరిస్థితి మిగతా 02లో

### నెలాఖరులోగా లక్ష
## ఇందిరమ్మ ఇండ్ల
# గృహప్రవేశాలు

03

మంజూరు చేసిన అన్ని ఇండ్లు గ్రౌండింగ్ కావల్సిందే

- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్ధిదారులను గుర్తించండి
- మంజూరు చేసిన అన్నిఇండ్లకు చెల్లింపులు జరపాలి
- ప్రజా పాలన- ప్రగతి నివేదిక కార్యాచరణపై
- జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్



## గద్దర్ అవార్డుల ప్రకటన

### ఉత్తమ చిత్రం
# రాజు వెడ్స్ రాంబాయి

12

- ఉగాది రోజున పురస్కారాల ప్రదానోత్సవం
- ఉత్తమ నటీనటులుగా నాగ చైతన్య, రష్మిక ఎంపిక
- మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం
- దిగ్గజాలకు గౌరవ పురస్కారాల ప్రకటన
- సాంకేతిక విభాగాల్లో సత్తా చాటిన చిత్రాలు

*తెలంగాణ చలనచిత్ర పరిశ్రమలో ప్రతిభకు పట్టం కడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక 'గద్దర్ అవార్డులను' ప్రకటించింది. ఉగాది పర్వదినాన పురస్కారాల ప్రదానోత్సవానికి రంగం సిద్ధం కాగా ఉత్తమ చిత్రంగా 'రాజు వెడ్స్ రాంబాయి' నిలవగా, మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు దక్కడం సినీ వర్గాల్లో ఆనందం నింపింది.*



ముచ్చట

విడాకుల కేసు ముగిసే వరకు చెన్నైలోని సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆయన భార్య సంగీత కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల ముందర విజయ్ కు భార్య పోరు తప్పేలా లేదు..



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 08.03.2026
www.mudranews.in | @mudranews



## బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు




**హై బ్లడ్ ప్రెషర్**

అధిక రక్తపోటు రక్తనాళాలను బలహీనపరుస్తుంది. దీనివల్ల మెదడులో రక్తస్రావం లేదా రక్తనాళం మూసుకుపోవడం జరుగుతుంది.

# ఊరుకుంటేనే ఉత్తమం!

(మొదటి పేజీ తరువాయి)

నేతలకు హైకమాండ్ గా సీఎం రేవంత్ రెడ్డి మారారు. వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు పంపడం ద్వారా రేవంత్ రెడ్డి హైకమాండ్ వద్ద తన పట్టు నిరూపించుకున్నారు. తనపై అసంతృప్తి గళం వినిపిస్తున్న వారికి గట్టిసందేశం పంపారు. తెలంగాణ కాంగ్రెస్ కు సంబంధించినంత వరకూ అంతా తన కనుసన్నల్లోనే ఉంటుందని ఎవరైనా తోక జాడిస్తే రాజకీయ భవిష్యత్ ఉండదన్నంత పట్టు సాధించినట్లుగా చెప్పకనే చెప్పారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి వాళ్లు.. తెర వెనుక ఏమైనా చేయాలనుకున్నా సైలెంటుగా గా ఉండటం.. కుదిరితే రేవంత్ భజన ప్రారంభించడం మినహా మరో దారి లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. రేవంత్ చాలా స్వల్ప కాలంలోనే పార్టీని గుప్పిట్లోకి తెచ్చుకున్నారని అందరూ అంచనాకు వస్తున్నారు.

**వేం నరేందర్ రెడ్డి ఎంపిక**

తెలంగాణ కాంగ్రెస్‌లో ఒకప్పుడు గ్రూపు రాజకీయాలు, సీనియర్ల అసమ్మతి గళాలు సర్వసాధారణం. కానీ, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వల్ప కాలంలోనే రేవంత్ రెడ్డి పార్టీని తన గుప్పిట్లోకి తెచ్చుకోవడంలో సఫలమయ్యారు. కీలక పదవులన్నీ తన కనుసన్నల్లోనే భర్తీ అయ్యేలా చూసుకుంటున్నారు. ఢిల్లీలోని అధిష్టానం వద్ద తన మాటే శాసనమని ఆయన నిరూపించుకున్నారు. రేవంత్ రెడ్డి కేవలం పాలనకే పరిమితం కాకుండా, పార్టీ అంతర్గత వ్యవహారాలపై పూర్తి స్థాయి పట్టు సాధించారు. ఒకప్పుడు రేవంత్ నాయకత్వాన్ని వ్యతిరేకించిన సీనియర్లు సైతం ఇప్పుడు ఆయన కనుసన్నల్లో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎవరైనా వ్యతిరేక గళం వినిపిస్తే వారి రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్న హెచ్చరికను రేవంత్ తన వ్యూహాల ద్వారా స్పష్టం చేశారు. దీంతో తెలంగాణ పార్టీలో నేనే హైకమాండ్ అనే స్థాయికి ఆయన ఎదిగారు, ఇది గత దశాబ్ద కాలంలో ఏ కాంగ్రెస్ ముఖ్యమంత్రికీ సాధ్యపడలేదు.

**అసంతృప్త నేతలు వ్యూహం మార్చుకోవాల్సిందే**

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి ఫైర్ బ్రాండ్ నేతలు కూడా ప్రస్తుతం రేవంత్ రెడ్డి విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గతంలో విభేదాలు ఉన్నప్పటికీ, రేవంత్ సాధించిన రాజకీయ విజయం చూశాక, ప్రస్తుతానికి ఆయనతో కలిసి వెళ్లడమే శ్రేయస్కరమని వారు భావిస్తున్నారు. తెర వెనుక ఎన్ని ప్రయత్నాలు చేసినా, రేవంత్ వ్యూహాల ముందు అవి ఫలించడం లేదని అర్థం చేసుకున్న నేతలు.. ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండటం లేదా రేవంత్ భజన వైపు మళ్లడం మినహా మరో దారి లేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

**ఢిల్లీ లెవల్లో పెరిగిన పరపతి**

రేవంత్ రెడ్డి బలం కేవలం రాష్ట్రానికే పరిమితం కాలేదు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేల వద్ద ఆయన సంపాదించుకున్న నమ్మకం అసాధారణం. రాష్ట్రం నుండి ఏ నిర్ణయం వెళ్లినా దానికి ఢిల్లీ ఆమోదముద్ర వేస్తుండటంతో, స్థానిక సీనియర్లు హైకమాండ్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసే అవకాశాలు మూసుకుపోయాయి. వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ సీటు దక్కడం అనేది రేవంత్ రెడ్డి ఢిల్లీ లాబీయింగ్‌లో సాధించిన అతి పెద్ద విజయంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. సాధారణ కార్యకర్తల్లో రేవంత్ రెడ్డి పట్ల ఉన్న ఆదరణే ఆయనకు కొండంత అండగా నిలుస్తోంది. దూకుడుగా నిర్ణయాలు తీసుకోవడం, ప్రత్యర్థులను రాజకీయంగా దెబ్బతీయడంలో ఆయన చూపిస్తున్న చొరవ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. పార్టీని ఒక కార్పొరేట్ తరహాలో క్రమశిక్షణతో నడిపిస్తూనే, తనను వ్యతిరేకించే శక్తులను ఒక్కొక్కటిగా ప్రక్కకు తప్పుకోవాల్సిన పరిస్థితిని కల్పించారు. మొత్తానికి తెలంగాణ కాంగ్రెస్‌లో రేవంత్ శకం మొదలైందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

# రాజ్ భవన్ రహస్యం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం ఒక పక్కా వ్యూహంతో ఉన్నట్లు కనిపిస్తోంది. జిష్ణుదేవ్ వర్మ హయాంలో ప్రభుత్వానికి, రాజ్ భవన్ కు మధ్య సంబంధాలు చాలా సజావుగా సాగాయి. గతంలో డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ హయాంలో ఉన్న ఘర్షణ వాతావరణం జిష్ణుదేవ్ వర్మ వచ్చిన తర్వాత కనిపించలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా కేంద్రంతో పాలనాపరమైన సత్సంబంధాలను కొనసాగిస్తూ వచ్చింది. అయితే, తాజా మార్పుతో బీజేపీ తన పంథాను మార్చుకోబోతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిష్ణుదేవ్ వర్మను కీలకమైన మహారాష్ట్రకు పంపి, సీనియర్ రాజకీయ నేత శివ ప్రతాప్ శుక్లాను ఇక్కడకు తీసుకురావడం వ్యూహాత్మకమే.

**కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ - ఇక ప్రత్యక్ష యుద్ధం**

ఇప్పటివరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేంద్రంతో రాజకీయంగా విరోధం – పాలనాపరంగా మైత్రి అనే సూత్రాన్ని పాటిస్తోంది. కానీ, గవర్నర్ మార్పుతో ఈ వాతావరణం మారే సూచనలు కనిపిస్తున్నాయి. బీజేపీ ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న దూకుడు గవర్నర్ విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేస్తే, రేవంత్ సర్కార్‌కు ఇబ్బందులు తప్పవు. బీజేపీ కేవలం ఒక రాజకీయ పార్టీగా కాకుండా, ప్రభుత్వ యంత్రాంగంలోని అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లాలని చూస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని చాటిచెప్పడానికి, గవర్నర్ మార్పు ఒక మొదటి అడుగుగా భావించవచ్చు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై గవర్నర్ జోక్యం పెరిగితే, అది సహజంగానే అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా సవాలుగా మారుతుందని అనుకోవచ్చు.

**అజారుద్దీన్ కు కష్టమేనా..?**

తెలంగాణకు కొత్త గవర్నర్ వచ్చారు. ముగ్గురు గవర్నర్లు మారినా ప్రొఫెసర్ కోదండ రాం ఎమ్మెల్సీ పదవి మాత్రం ఇంకా ఊగిసలాటలోనే వుంది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అజారుద్దీన్ కూడా ఎమ్మెల్సీగా ఎన్నికవడానికి గడువు దగ్గరపడుతోంది. వారి పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదిస్తూ రాష్ట్ర క్యాబినెట్ చేసిన సిఫారసులు ఈ గవర్నరైనా ఆమోదించి చట్టసభ సభ్యులయ్యే అవకాశమిస్తారో లేదో అనే టెన్షన్ కాంగ్రెస్‌లో కనిపిస్తోంది.

**త్రిశంఖు స్వర్గంలోనే ప్రొ. కోదండరాం ఎమ్మెల్సీ పదవి**

తెలంగాణ జేఏసీ కన్వీనర్, తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం శాసన మండలిలో అడుగుపెట్టే అదృష్టం చాలా కాలంగా ఊగిసలాడుతూ వస్తోంది. రెండు సార్లు ప్రభుత్వం ఆయన అభ్యర్థిత్వాన్ని గవర్నర్ కు సిఫారసుచేసినా, గవర్నర్ ఓసారి ఆమోదించినా న్యాయపర చిక్కులు ఆయన ప్రమాణస్వీకారానికి అడ్డుపడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్ ను, కుర్ర సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా సిఫారసులు పంపింది. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ వారి పేర్లను తిరస్కరించారు. ఇద్దరికీ రాజకీయ పార్టీతో ప్రత్యక్ష సంబంధాలున్నాయనీ, ఏ రంగంలోనూ నిష్ణాతులు కాదు కాబట్టి ఆ పేర్లను తాను ఆమోదించలేనని చెప్పారు. ఇంతలో కేసీఆర్ ప్రభుత్వం మారి రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చింది. గవర్నర్ నిర్ణయం పై దాసోజు హైకోర్టును ఆశ్రయించారు. క్యాబినెట్ చేసిన సిఫారసులను తిరస్కరించే అధికారం గవర్నర్ కు ఉండదని హైకోర్టులో పిటిషన్ లో పేర్కొన్నారు.

**అప్పట్నుంచీ కోర్టు చిక్కుల్లోనే**

2023 డిసెంబర్ లో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత సిఫారసులను వెనక్కు తీసుకుని కొత్తగా ప్రొఫెసర్ కోదండరాం, పాత్రికేయుడు ఆమిర్ అలీ ఖాన్ లను ఎమ్మెల్సీగా ప్రతిపాదించారు. ఈసారి గవర్నర్ వారి పేర్లకు ఆమోదం కూడా తెలిపారు. దాసోజు శ్రవణ్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు 2024 మార్చిలో గవర్నర్ తమిళిసై నిర్ణయాన్ని తప్పుపట్టింది. గవర్నర్ కు క్యాబినెట్ సిఫారసులను తిరస్కరించే అధికారం లేదని చెప్తూ కోదండరాం, అమీర్ అలీ ఖాన్ ల నామినేషన్ చెల్లదని చెప్పింది. హైకోర్టు నిర్ణయం పై సుప్రీం కోర్టు మొదట స్టే ఇచ్చింది. దీంతో ప్రక్రియ మళ్లీ మొదలైంది, ఈసారి రాష్ట్ర ప్రభుత్వం కోదండరాం, అజరుద్దీన్ ల పేర్లను గవర్నర్ కోటాకింద సిఫారసు చేసింది. సుప్రీం కోర్టు 2025 ఆగస్టులో మునుపటి వ్యాఖ్యలపై తదుపరి వివరణ ఇస్తూ ప్రభుత్వ సిఫారసు చేసిన పేర్లకు నిబంధనలు పాటిస్తూ గవర్నర్ ఆమోదం తెలిపినా అది కోర్టు తుది తీర్పునకు లోబడే చెల్లుబాటవుతుందని చెప్పింది.

**కొత్త గవర్నర్ ఏం చేస్తారు.. గండం నుంచి అజర్ మంత్రి పదవి బయటపడుతుందా.. ?**

సుప్రీకోర్టు తుది తీర్పునకు లోబడే అనే నిబంధన నేపథ్యంలో అప్పటి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏ నిర్ణయం తీసుకోకుండా ఉన్నారు. మరి ఇప్పుడు నూతన గవర్నర్ గా శివ్ ప్రతాప్ శుక్లా ఆధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఈయన ఏంచేస్తారు. కొత్త గవర్నర్ ను ఒప్పించి ఆమోదించుకోవడంలో రేవంత్ సఫలీకృతులవుతారా.. లేదా మూడో సారి కోదండరాం పేరును సిఫారసు చేయాల్సుంటుందా. ఇప్పటికే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి చట్టసభ సభ్యుడయ్యేందుకు నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్న అజర్ భవితవ్యం ఏంటనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. దాసోజు శ్రవణ్ మాత్రం మా పిటిషన్ పండింగ్ లో వుండగా కొత్త గవర్నర్ కూడా ఆమోదం తెలపలేరంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే పదవికి అజర్ అర్హత కోల్పోయే ప్రమాదం పొంచివున్నట్టే.

## బీజేపీ మాస్ వ్యూహం ?

కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఆరితేరిన నేత. రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకుంది. హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రంలో రాజకీయ పరిణామాలను సమర్థవంతంగా గమనించిన చరిత్ర ఆయనది. తెలంగాణలో బీజేపీ పుంజుకోవాలని చూస్తున్న తరుణంలో, ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపడంలోనూ, రాజ్యాంగ పరమైన అంశాల్లో గట్టిగా వ్యవహరించడంలోనూ ఆయన క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కొన్ని ప్రాంతాల్లో మంచి ఫలితాలు సాధించింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో పార్టీ బలపడటం తో, 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో కేవలం రాజకీయ పోరాటమే కాకుండా, గవర్నర్ వ్యవస్థ ద్వారా కూడా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. బిల్లుల ఆమోదం, యూనివర్సిటీ నియామకాలు, పాలనాపరమైన విచారణల విషయంలో ఇకపై రాజ్ భవన్ నుంచి గట్టి సమాధానాలు రావొచ్చని భావిస్తున్నారు.

# పశ్చిమాసియా రణరంగం

(మొదటిపేజీ తరువాయి)

అదుపు తప్పింది.

**దాడుల తీవ్రత - భారీ ప్రాణనష్టం**

ఈ దాడుల్లో మెహరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతింది. విమానాశ్రయంలో పార్క్ చేసిన పలు విమానాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆకాశాన్ని తాకేలా మంటలు ఎగిసిపడటంతో ప్రజలు భయాందోళనలకు గురై సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. విమానాశ్రయం నుంచి అన్ని రకాల రాకపోకలను నిలిపివేశారు. తాజా నివేదికల ప్రకారం, ఈ దాడుల్లో మరణించిన వారి సంఖ్య 1300 దాటడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది.

**మారిన సమీకరణాలు**

ఈ పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ప్రాంతీయ భద్రతను కాపాడే నెపంతో అమెరికా తన శక్తిమంతమైన యుద్ధ నౌకలను గల్ఫ్ జలాల్లోకి పంపింది. మరోవైపు, యూఏఈ,సౌదీ అరేబియాలపై డ్రోన్, క్షిపణి దాడుల కలకలం రేగడంతో ఆయా దేశాలు అప్రమత్తమయ్యాయి. ఇరాన్‌కు వైట్ హౌస్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసింది.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**

యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ మండుతున్నాయి. చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును చేరుకునే దిశగా పరుగులు తీస్తున్నాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

**ఇరాన్ వ్యూహంపై సందిగ్ధత**

ప్రస్తుతానికి ఇరాన్ తన సైనిక దాడులను తగ్గించి సైలెంట్ మోడ్‌లోకి వెళ్లడం వ్యూహాత్మకమా లేక మరేదైనా కారణమా అన్నది చర్చనీయాంశమైంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల ప్రభావంతో ఇరాన్ తన క్షిపణి, డ్రోన్ దాడులను గణనీయంగా తగ్గించినట్లు కనిపిస్తోంది. అయితే, ఇరాన్ ఈ డ్రోన్ యుద్ధాన్ని కొనసాగించే అవకాశం ఉందా లేదా అనేది వేచి చూడాల్సిందే.



# ఘనంగా మాధవ రెడ్డి 26వ వర్ధంతి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి:**

దివంగత మాజీ మంత్రి ఎలిమినేటి మాధవ రెడ్డి 26 వర్ధంతిని భువనగిరిలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి వద్ద ఉన్న మాధవ రెడ్డి విగ్రహానికి ఆయన కుమారుడు, భువనగిరి జిల్లా మాజీ జడ్పి చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తంశెట్టి మంజుల వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు పెంట నరసింహ, నువ్వులప్రసన్న సత్యనారాయణ, పోతంశెట్టి వెంకటేష్, కౌన్సిలర్స్ నాయిని పూర్ణచందర్, మాజీ కౌన్సిలర్ తాడురు బిక్షపతి, తల్లం కృష్ణ, డొప్ప వెంకటేష్ ముదిరాజు, బచ్చు వెంకటేష్ గుప్తా, యాట కుమార్, నిలికొండ శివకుమార్. ఎలిమినేటి సుమన్ రెడ్డి, బచ్చు శ్రీనివాస్ గుప్తా, దూసరి చంద్రశేఖర్ గౌడ్, మాటూరు ఆంజనేయులు, సుదగాని మహేందర్ గౌడ్, మహేష్ నాయక్ పాల్గొన్నారు.

# టెక్ రంగంలో మారుతున్న సమీకరణాలు

**ముద్ర డెస్క్ :**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విప్లవం ప్రపంచ టెక్నాలజీ రంగాన్ని ఊహించని మలుపు తిప్పుతోంది. ఒకవైపు ఈ సాంకేతికత అద్భుతమైన ఆవిష్కరణలకు బాటలు పరుస్తుంటే.. మరోవైపు ఉద్యోగ భద్రతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. తాజాగా టెక్ దిగ్గజం 'ఒరాకిల్' సుమారు 30 వేల మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమవుతోందన్న వార్తలు పరిశ్రమ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఖర్చులను తగ్గించుకోవడమే లక్ష్యంగా కంపెనీ తీసుకుంటున్న ఈ నిర్ణయం ప్రస్తుత టెక్ ప్రపంచంలో జరుగుతున్న అంతర్గత మార్పులకు అద్దం పడుతోంది.

**పెట్టుబడుల భారం..**

ఒరాకిల్ ఇటీవల క్లౌడ్ మౌలిక సదుపాయాలు.. ఏఐ మోడళ్ల అభివృద్ధి కోసం భారీగా పెట్టుబడులు పెట్టింది. ముఖ్యంగా ఏఐ ప్రాసెసింగ్‌కు అవసరమైన అత్యాధునిక డేటా సెంటర్ల నిర్మాణానికి కంపెనీ భారీగా అప్పులు తీసుకున్నట్లు సమాచారం. ఈ విస్తరణ వ్యూహం దీర్ఘకాలంలో లాభదాయకం కావచ్చు.. కానీ స్వల్పకాలంలో కంపెనీపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపింది. ఈ వ్యయాన్ని సమతుల్యం చేయడానికి వాటాదారుల అంచనాలను అందుకోవడానికి ఉద్యోగుల తగ్గింపే ఏకైక మార్గమని యాజమాన్యం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.

**ఆటోమేషన్.. మానవ శ్రమకు ప్రత్యామ్నాయమా?**

ఈ లేఆఫ్స్ వెనుక ఉన్న ప్రధాన కారణాల్లో 'ఆటోమేషన్' ఒకటి. డేటా ప్రాసెసింగ్, కస్టమర్ సపోర్ట్, రూటీన్ అడ్మినిస్ట్రేటివ్ పనులను ఏఐ ఆధారిత సిస్టమ్స్ మరింత వేగంగా తక్కువ ఖర్చుతో చేయగలవు. దీనివల్ల మానవ వనరుల అవసరం తగ్గుతోందని కంపెనీలు భావిస్తున్నాయి. కేవలం ఒరాకిల్ మాత్రమే కాదు అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు కూడా గత రెండేళ్లుగా ఇదే బాటలో పయనిస్తూ వేలాది మందిని ఇంటికి పంపాయి. 2026 నాటికి ఇప్పటికే టెక్ రంగంలో 35,000 మందికి పైగా ఉపాధి కోల్పోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది.

**మారుతున్న నైపుణ్యాల అవసరం**

టెక్ రంగంలో జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ఆందోళన కలిగించేవే కావు.. కొత్త అవకాశాలకు ద్వారాలు తెరుస్తున్నాయి. సంప్రదాయ ఐటీ పాత్రలు కనుమరుగవుతున్న తరుణంలో డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఏఐ మోడల్ ట్రైనింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాల్లో నిపుణుల కొరత వేధిస్తోంది. అంటే ఉద్యోగాలు తగ్గడం లేదు, కేవలం 'నైపుణ్యాల అవసరం' మారుతోంది. పాత పద్ధతుల్లో పనిచేసే వారికంటే, ఏఐతో కలిసి పనిచేయగలిగే వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయి.

**పరివర్తన తప్పదా?**

ఒరాకిల్ వంటి సంస్థ తీసుకునే ఈ నిర్ణయాలు టెక్ రంగంలో ఒక కొత్త 'నార్మల్'ను సృష్టిస్తున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ, వేగవంతమైన ఆటోమేషన్, ఏఐపై ఆధారపడటం అనేవి భవిష్యత్తులో టెక్ కంపెనీల మనుగడకు ప్రధాన సూత్రాలుగా మారనున్నాయి. అయితే ఈ మార్పుల వల్ల ప్రభావితమవుతున్న ఉద్యోగులకు కొత్త నైపుణ్యాలను అందించడం..సామాజిక భద్రత కల్పించడం వంటి అంశాలపై కూడా కంపెనీలు దృష్టి సారించాల్సి ఉంది. మొత్తం మీద టెక్నాలజీ ప్రపంచం ఒక కీలక మలుపులో ఉంది. ఇక్కడ నిరంతర అభ్యాసం మాత్రమే ఉద్యోగులకు శ్రీరామరక్ష.

# ప్రకృతి నియమాలకే సవాలు

## అమెరికాలోని వింత ప్రదేశం 'ఒరెగాన్ వోర్టెక్స్'



**ముద్ర డెస్క్:**

ప్రపంచంలో ఎన్నో వింతలు మనిషి అర్థానికి అందకుండా ఇంకా రహస్యంగానే మిగిలిపోయాయి. అలాంటి ఆశ్చర్యకరమైన ప్రదేశాల్లో అమెరికాలోని ఒరెగాన్ వోర్టెక్స్ ఒకటి. ప్రకృతి నియమాలనే సవాలు చేస్తూ కనిపించే ఈ ప్రాంతం శాస్త్రవేత్తలకు కూడా ఇప్పటికీ పూర్తిగా అర్థంకాని మర్మంగా నిలిచింది. అమెరికా దేశంలోని ఒరెగాన్ రాష్ట్రంలో ఉన్న ఈ వింత ప్రదేశం పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రాంతంలో అడుగుపెడితే సాధారణంగా మనం తెలిసిన భౌతిక శాస్త్ర నియమాలు పనిచేయడం లేదన్నట్టుగా అనిపిస్తుంది. ముఖ్యంగా అక్కడ కనిపించే దృశ్యాలు మన కళ్లను, మెదడును గందరగోళానికి గురిచేస్తాయి.ఈ వోర్టెక్స్ ప్రాంతంలో ఒక చిన్న గుడిసె ఆకారంలోని ఇల్లు ఉంది. ఈ ఇంటి లోపలికి వెళ్తే ఆశ్చర్యకరమైన ఘటనలు కనిపిస్తాయి. ఇద్దరు వ్యక్తులు ఒకే ఎత్తు ఉన్నా, ఒకరు మరోకరితో పోలిస్తే చాలా పొడవుగా లేదా చాలా పొట్టిగా కనిపిస్తారు. ఒకే వ్యక్తి రెండు స్థానాల్లో నిల్చుంటే ఎత్తు మారిపోయినట్టుగా కనిపించడం కూడా ఇక్కడ సాధారణమే.

ఇక్కడి మరో విశేషం ఏమిటంటే బంతిని నేలపై ఉంచితే అది కిందికి కాకుండా పైవైపు దొర్లుతున్నట్టుగా కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో నీరు కూడా గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా ప్రవహిస్తున్నట్టుగా కనిపిస్తుంది. ఈ దృశ్యాలు చూసిన వారు నిజంగానే ఇది మాయ లోకం అనిపిస్తుందని చెబుతుంటారు. ఈ వింతల వెనుక అసలు కారణం ఏమిటన్నది మాత్రం ఇప్పటికీ స్పష్టంగా తెలియలేదు. కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఇది కేవలం కంటి భ్రమ మాత్రమే. భూమి ఒరుసు, చెట్ల పెరుగుదల కోణం, భవనం నిర్మాణం అన్ని కలిసి మన కళ్లకు వాస్తవం కాకుండా వేరేలా కనిపించేలా చేస్తాయని వారు చెబుతున్నారు. అయితే మరికొందరు మాత్రం ఇక్కడ భూమి అయస్కాంత క్షేత్రంలో ఏదో ప్రత్యేకమైన మార్పు ఉండొచ్చని భావిస్తున్నారు. ఆ అయస్కాంత ప్రభావం వల్లే మన శరీర సమతుల్యత, దృష్టి భ్రమలు కలుగుతాయని వారు అనుమానిస్తున్నారు.

ఏది నిజమో ఇప్పటికీ ఖచ్చితంగా చెప్పలేకపోయినా ఒరెగాన్ వోర్టెక్స్ ప్రపంచంలోని అత్యంత రహస్యమైన ప్రదేశాల్లో ఒకటిగా నిలిచింది. ప్రతి సంవత్సరం వేలాది మంది పర్యాటకులు ఈ వింతను ప్రత్యక్షంగా చూడటానికి అక్కడికి వెళ్తుంటారు. శాస్త్రానికి సవాలు విసురుతున్న ఈ రహస్య ప్రదేశం మనకు ఒక విషయాన్ని మాత్రం గుర్తు చేస్తుంది. ప్రకృతి ముందు మనిషి జ్ఞానం ఇంకా చాలా చిన్నదే. ఇంకా ఎన్నో వింతలు, రహస్యాలు ఈ భూమిలో దాగి ఉన్నాయనే విషయాన్ని ఈ వోర్టెక్స్ మళ్లీ మనకు తెలియజేస్తోంది.

# 26 ఏళ్ల హత్య మిస్టరీ వీడింది

**ముద్ర డెస్క్ :**

సమాజంలో నిత్యం రకరకాల క్రైంలు జరుగుతున్నాయి. రకరకాల క్రైం వార్తలు చదువుతున్నాం.. చూస్తున్నాం. కానీ ఇలాంటి క్రైం ఎక్కడా జరిగి ఉండదు. ఇందులో ఉన్న ట్విస్టులు ఎందులోనూ ఉండవు. ఇది జపాన్‌లో జరిగింది. జపాన్ నాగోయాలో 1999లో జరిగిన హత్య కేసు 26 సంవత్సరాల తర్వాత 2025లో హంతకులు ఎవరో తెలిసింది. అనేక ట్విస్ట్‌లతో కూడిన ఈ హత్యను పోలీసులు ఛేదించలేదు. హంతకులే చివరకు హత్య చేసినట్లు అంగీకరించడం మరో ట్విస్ట్.

**ఏం జరిగిందంటే..**

1999 సెప్టెంబర్ 2న నాగోయా వెస్ట్ వార్డ్ అపార్ట్‌మెంట్‌లో 32 ఏళ్ల నమికో తకాబాను గొంతులో కత్తితో పొడిచి చంపేశారు. అప్పుడు ఆమెకు 2 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఆయనను ఏమీ చేయలేదు. బయటకు వెళ్లిన భర్త తకాబా షిన్‌యా ఇంటికి వచ్చి దృశ్యం చూసి షాక్ అయ్యాడు వెంటనే పోలీసులకు కాల్ చేశాడు. స్థలంలో ఆ టైప్ రక్తం, గాయపడిన వివరాలు, కత్తి దొరికాయి.

**సుదీర్ఘ విచారణ..**

పోలీసులు 26 ఏళ్లలో 5 వేల మందిని విచారణ చేశారు. లక్ష మంది అధికారులను ఉపయోగించారు. 2015, 2020లో సందేహాస్పద మహిళల స్కెచ్‌లు విడుదల చేశారు. మరోవైపు తకాబా హత్య జరిగిన ఇంటికి 26 ఏళ్లుగా అద్దె చెల్లిస్తూ వచ్చాడు. కొత్తగా ఎవరైనా వస్తే అక్కడి ఆధారాలు చెదిరపోతాయని ఇలా చేశాడు. అనేక చోట్ల విచారణ చేశాడు. స్నేహితులు, బంధువులను ఆరా తీశాడు. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చాడు. హంతకులు ఎవరో చెబితే నగదు బహుమతి ఇస్తానని ప్రకటించాడు.

**షాకింగ్ ట్విస్ట్..**

2025 అక్టోబర్‌లో 69 ఏళ్ల కుమికో యాసుఫుకు హత్య తానే చేసినట్లు అంగీకరించింది. ఈమె ఆమె తకాబా స్కూల్‌మేట్. ఇంటర్‌లో ప్రేమ ప్రతిపాదన తిరస్కరణ కోపంతో భార్యను లక్ష్యంగా చేసుకుంది. 26 ఏళ్లు భయంతో 'నిత్య నరకం' అనుభవించి, నిజం ఒప్పుకుంది. మార్చి 5న ఇండిక్ట్ చేశారు. తకాబా షాక్‌లో ఉన్నాడు.'ఎన్నోసార్లు ఆమెతో మాట్లాడాను, ప్రయాణాలు చేశాను, ఊహించలేకపోయాను' అన్నాడు. ఈ కేసు జపాన్‌లో దీర్ఘకాల దర్యాప్తులకు చిహ్నం; ప్రేమ కోపం దీర్ఘ శిక్షగా మారడం హృదయ విదారకం. పోలీసు పట్టుదల ప్రజల ఆశీస్సులు పొందాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు
డయాబెటిస్ (మధుమేహం)
మధుమేహం ఉన్నవారిలో రక్తనాళాలు దెబ్బతింటాయి. దీని వల్ల మెదడుకు సరైన రక్తప్రసరణ తగ్గి స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది..



# ఓరుగల్లుకు మహార్దశ

- మున్సిపల్ కార్పొరేషన్ కు రూ. 5,257 కోట్లు మంజూరు
- భూ గర్భ డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం
- 50:25:25 శాతం నిధులతో పనులు
- గతంలోనే పూర్తయిన డీపీఆర్



ముద్ర, వరంగల్ :

గ్రేటర్ వరంగల్ దశ తిరిగింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం శనివారం రూ.5,257 కోట్లు మంజూరు చేసింది. వరంగల్ అండర్ డ్రైనేజీ ప్రాజెక్టుకు జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ రుణం సమకూరుస్తోంది. 50శాతం రుణం కాగా.. మరో 25 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం, 25శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ప్రాజెక్టు చేపట్టనున్నారు. మరో వైపు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం గతంలో రూ.5,257 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించారు. కాగా వరంగల్.. రాష్ట్రంలో రెండో పెద్ద నగరంగా గుర్తింపు సంపాదించుకుంది. ఓరుగల్లుకు సంబంధించి ఒకవైపు మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. మరోవైపు వరంగల్ ప్రజల చిరకాల కోరిక అయిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. మూడు దశల్లో నిధులను వెచ్చించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. ముందుగానే చెప్పుకున్నట్లుగా తెలంగాణలో రెండో అతిపెద్ద నగరంగా గుర్తింపు పొందిన వరంగల్‌లో ఇప్పటికీ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఫలితంగా మురుగు కాలువలు పొంగిపొర్లుతూ.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎన్నాళ్లుగానో డిమాండ్ ఉంది. మరోవైపు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా భూగర్భంలో కాలువల వ్యవస్థను ఏర్పాటుచేస్తారు. అలాగే వర్షపునీటి ప్రవాహంయాజమాన్య వ్యవస్థ, నీటిసరఫరా, చెరువులు, నీటి వనరుల పునరుజ్జీవం కోసం చర్యలు తీసుకుంటారు. ఇక టెలికాం, విద్యుత్తు, కేబుల్, ఇంటర్నెట్ వంటి వాటికి భూగర్భ సొరంగాలు నిర్మిస్తారు. ఈ పనులు అన్నీ విడతల వారీగా చేపట్టనున్నారు. మరోవైపు వరంగల్ భూగర్భ డ్రైనేజీ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనుల్లో వేగం పెరిగేందుకు అవకాశం ఉంది. డీపీఆర్ తయారీ, నిధుల మంజూరు నేపథ్యంలో త్వరలోనే వరంగల్ కొత్త రూపు సంతరించుకుంటుందని అధికారులు చెప్తున్నారు.

# నల్గొండను మొదటి స్థానంలో నిలపాలి..

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో ఇన్ చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



ముద్ర, నల్గొండ:

నల్గొండను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలపాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

నల్గొండ, మార్చి 7: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో నల్గొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం నల్గొండలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని, అలాగే గ్రామీణ సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

### 10 కీలక అంశాలు..

ప్రభుత్వం నిర్దేశించిన 10 ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. వీటిలో పరిసరాల పరిశుభ్రత, కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, మహిళా మరియు శిశు భద్రత, రోడ్డు భద్రత, రైతు సంక్షేమం వంటివి ముఖ్యమైనవని పేర్కొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లు..

ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ సోమవారం లోపు ప్రభుత్వం క్లియర్ చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉంటుందని వెల్లడించారు.రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలు అర్హులైన పేదలకు సకాలంలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.కార్యక్రమ అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశామని, జిల్లా కలెక్టర్లు ప్రతిరోజూ నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంట సత్యం, శంకర్ నాయక్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నల్గొండ మేయర్ చైతన్య బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ముగిసిన అధ్యాయం!

- 130 మంది మావోయిస్టుల లొంగుబాటు
- చర్చలే సమస్యల పరిష్కారం
- కేంద్ర హోంశాఖ మంత్రితో చర్చించి అండగా ఉంటాం
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ముద్ర, తెలంగాణ బ్యూరో :

ఆయుధాలు, హింస ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం దొరకదని, ప్రజాస్వామిక మార్గంలోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి వచ్చి, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. లొంగిపోయే మావోయిస్టులకు రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం 130 మంది మావోయిస్టులు 124 అత్యాధునిక ఆయుధాలతో సహా సీఎం ముందు లొంగిపోయారని అన్నారు. ఈ సందర్భంగా మావోయిస్టుల ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా ఆర్థిక, ఇతర వసతులను కల్పిస్తుందని వారిలో నమ్మకం కలిగించిన పోలీసు ఉన్నతాధికారులను సీఎం అభినందించారు. అహింసా, శాంతిమార్గం ప్రపంచంలో అత్యంత బలమైన ఆయుధాలని వ్యాఖ్యానించారు. ఎంత పెద్ద సమస్యకైనా సరే చర్చలే పరిష్కార మార్గం అన్నారు.

### సమస్యల పరిష్కారం నా బాధ్యత

ఇటీవల లొంగిపోయిన కీలక నేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి సహా ఇద్దరు ముగ్గురు కీలక నేతలతో సమావేశమై వారితో సుదీర్ఘంగా చర్చించినట్లు సీఎం తెలిపారు. వారు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని మాట ఇచ్చానని అన్నారు. కేంద్ర హోం మత్రి అమిత్ షాతో చర్చించి వారికి పునరావాసం కల్పించాలని కోరినట్లు చెప్పారు. లొంగిపోయేందుకు సిద్ధమైన మావోయిస్టులకు నమ్మకం కల్పిస్తున్నామని సీఎం అన్నారు. తమపై నమ్మకం పెట్టుకున్న వారిని కాపాడుకునే బాధ్యత కూడా తమదేనని అన్నారు.

### తెలంగాణలో మావోయిస్టు రాష్ట్ర కమిటీ లేదు : డీజీపీ శివధర్ రెడ్డి

తెలంగాణలో మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ ఇక లేదని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ కమిటీకి సంబంధిచి మిగిలిన వారందరూ సరెండర్ అయ్యారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు 124 ఆయుధాలు అప్పగించి లొంగిపోయారన్నారు. లొంగిపోయిన వారిలో 125 మంది మావోయిస్టులు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వారున్నారన్నారు. తెలంగాణకు చెందిన వారు నలుగురు ఉండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు ఒకరు ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు.

లొంగిపోయిన వారిలో స్టేట్ కమిటీకి చెందిన వారు ముగ్గురు, డివిజనల్ కమిటీకి చెందిన10మంది, 40మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. అలాగే 70 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు ఉన్నట్లు డీజీపీ వివరించారు. తాజాగా లొంగిపోయినవారితో కలిపి ఇప్పటి వరకూ తెలంగాణలో 721 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు వెల్లడించారు.



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన సూచన మేరకు మావోయిస్టులు లొంగిపోతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో తెలంగాణకు సంబంధించిన వారు ఇతర కమిటీలన్నింటిలో కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారని వారు కూడా త్వరగా సరెండర్ కావాలని పిలుపునిచ్చారు.

### ఆర్థిక సాయం..

లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం నగదు బహుమతి అందించనున్నది. జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత.. వారు జీవించేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించనుంది. తెలంగాణ ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం.. లొంగిపోయిన మావోయిస్టులకు వారి కేడర్ ఆధారంగా రివార్డు అందిస్తారు. డివిజనల్ కమిటీ సభ్యులు అయితే రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులు అయితే రూ.4 లక్షలు, మావోయిస్టు పార్టీ సభ్యులకు రూ.లక్ష నగదు బహుమతి అందిస్తారు. కేంద్ర హోంశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆయుధాలతో సహా లొంగిపోయేవారికి అదనపు ప్రోత్సాహకాలు అందిస్తారు.

# 'ఇందిరమ్మ'కు ప్రాధాన్యం

- ఈ నెలాఖరులోగా లక్ష ఇళ్ల గృహప్రవేశాలు
- మంజూరైన ప్రతీ ఇల్లు పూర్తి కావాల్సిందే
- అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలి
- బిల్లులు వెంటనే మంజూరు చేయాలి
- ప్రజా పాలన- ప్రగతి నివేదిక కార్యాచరణపై
- జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ల తో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

ముద్ర, తెలంగాణ బ్యూరో :

ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒక బెంచ్ మార్క్‌గా నిలవబోతోందని రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 3.60 లక్షల ఇండ్లను మంజూరు చేయగా ఇందులో లక్ష ఇండ్లకు ఈనెల 31వ తేదీలోగా గృహప్రవేశాలు నిర్వహిస్తామని చెప్పారు. గృహప్రవేశాలకు అనుకూలమైన తేదీలను త్వరలోనే అధికారికంగా తెలియజేస్తామని తెలిపారు. ఇండ్లు మంజూరు చేసిన తర్వాత కూడా కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పూరిగుడిసెలు కనిపిస్తున్నాయని, అటువంటి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఇళ్ల నిర్మాణంలో చేర్చాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఇల్లు నిజంగా అవసరమైన వారికి చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



శనివారం సచివాలయంలోని తన కార్యాలయం నుంచి ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణపై జిల్లా హౌసింగ్ పీడీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసిన ఇండ్లలో 20 శాతం వరకు గ్రౌండింగ్ కాలేదన్నారు. అలాంటి ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల సమ్మతి తీసుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల సూచనలతో మార్చి 31 లోపు అన్ని ఇండ్లు గ్రౌండింగ్ అయ్యేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తికి దగ్గరగా ఉన్న ఇళ్లను సమర్థంగా సమన్వయం చేసుకొని జూన్ చివరినాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ లో రెండవ దశ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేనాటికి మొదటి దశ ఇందిరమ్మ ఇండ్లు కొలిక్కిరావాలని సూచించారు.

### ధరల నియంత్రణ కమిటీలు చురుకుగా పనిచేయాలి

ఇండ్ల నిర్మాణంలో ఉపయోగించే నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో లబ్ధిదారులపై అదనపు భారం పడకుండా జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు చురుకుగా పనిచేయాలని మంత్రి సూచించారు. అవసరమైతే జిల్లా కలెక్టర్లతో కలిసి సమీక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకల సరఫరా పెంచేందుకు స్థానికంగా ఎస్ హెచ్ జి మహిళా సంఘాల ద్వారా బ్రిక్ యూనిట్లను ప్రోత్సహించాలని మంత్రి తెలిపారు. అవసరమైతే ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా సరఫరా పెరిగి ధరలు నియంత్రణలో ఉండే అవకాశముందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచిత ఇసుక పంపిణీ చేస్తుందని లబ్ధిదారులకు ఎక్కడా సమస్య రాకుండా ఈ ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### చెల్లింపులను క్లియర్ చేయండి

రాష్ట్రంలో కొన్ని చోట్ల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఒకటి లేదా రెండు విడతల చెల్లింపులు చేసిన తర్వాత వివిధ కారణాలతో చెల్లింపులు నిలిపివేయడం సరికాదని మంత్రి చెప్పారు. ఇటువంటి చెల్లింపులను తక్షణమే క్లియర్ చేయాలని లేని పక్షంలో అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు. ఏప్రిల్ నెల నుంచి మంజూరు చేసే రెండవ విడతలో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నిజమైన లబ్ధిదారుల ఇళ్లు ఎక్కడా ఆగిపోకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఏ స్థాయిలో నిర్మాణంలో ఉన్నాడబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను కూడా మార్చి 31 లోపు పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. ఇళ్ల స్థలం లేని పేద కుటుంబాలకు ఈ ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఏ సంక్షేమ పథకం విజయవంతం కావాలంటే ముఖ్యమంత్రి, మంత్రి, కార్యదర్శి మాత్రమే ప్రయత్నించడం సరిపోదని, ఆ శాఖలోని ప్రతి అధికారి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసినప్పుడే అది సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. అధికారుల సమిష్టి కృషితోనే రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశంలోనే ఉత్తమ పథకాల్లో ఒకటిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం అందించే గొప్ప సంక్షేమ కార్యక్రమమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం, అధికారులు భాగస్వాములుగా ఉండటం గర్వకారణమని, ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడానికి ప్రతి అధికారి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని హౌసింగ్ రంగంలో విజయవంతం చేయడానికి అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ యుద్ధ నౌకపై యూఎస్ దాడి

- జైశంకర్ కీలక వ్యాఖ్యలు

ముద్ర, డెస్క్ :

శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్‌దేనాపై దాడి చేసిన అమెరికా జలాంతర్గామి దానిని ముంచేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందించారు. ఇటీవల విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన పలు ఇరాన్ యుద్ధ నౌకలు అనుకోని విధంగా యుద్ధ ప్రభావానికి గురయ్యాయని అన్నారు. ఆ నౌకల ప్రయాణ ఉద్దేశం వేరైనా.. ఉద్రిక్త పరిస్థితుల వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అదే సమయంలో ఐరిస్ లావన్ అనే మరో నౌక తిరిగి వెళ్తుండగా అందులో సాంకేతిక సమస్య తలెత్తిందన్నారు. దీంతో కొచ్చిలో నౌక అత్యవసర నిలుపుదలకు ఇరాన్ విజ్ఞప్తి చేసిందన్నారు. ఈ విషయంలో చట్టపరమైన సమస్యలు ఉన్నప్పటికీ.. మానవతా దృక్పథంతో భారత్ ఈ నెల 1న సంబంధిత అనుమతి మంజూరు చేసిందన్నారు. దీంతో ఈ నెల 4న నౌకను ఇరాన్ కొచ్చిలో నిలిపిందన్నారు. అందులోని 183మంది సిబ్బందికి కొచ్చిలోనే ఆశ్రయమిచ్చినట్లు తెలిపారు. భారత్ సరైన నిర్ణయమే తీసుకుందన్నారు. శ్రీలంక తీరంలో దాడి జరిగిన వెంటనే ఐరిస్ దేనా నౌక నుంచి తొలుత శ్రీలంక నౌకాదళానికి ప్రమాద హెచ్చరిక వచ్చిందని, ఆ వెంటనే భారత నౌకా దళాలు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నాయని తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 8.03.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# సమదృష్టి –సాధికారత

"ఆకాశంలో సగం... అవనిలో సగం... మరి అవకాశాల్లో?"

కుటుంబ వ్యవస్థలో, సమాజ నిర్మాణంలో, దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర అసమానమైనది, అసామాన్యమైనది. కానీ ఆ ఆలోచన ఆచరణగా మారేది ఎప్పుడు? ఇవే బిలియన్ డాటర్స్ ప్రశ్నలు.ఈ నేపథ్యంలో మహిళల స్థితిగతులను పరిశీలిద్దాం. మారుతున్న సామాజిక పరిస్థితులతో సమస్యల తీవ్రతను అర్థం చేసుకుని, చట్టాలకతీతంగా సాధ్యమైన పరిష్కార మార్గాలను ఆలోచిద్దాం.గత ముప్పై సంవత్సరాల్లో, ముఖ్యంగా గత ఐదేళ్లలో మహిళల స్థితిలో మార్పు కనిపిస్తోంది. వివక్ష పూర్తిగా పోయిందని చెప్పలేం; కానీ మార్పు స్పష్టంగా ఉంది.స్త్రీలపై అఘాయిత్యాలు వార్తల్లో కనిపిస్తున్నాయి. అయినా హైదరాబాద్ వంటి నగరాల్లో వేలాది మహిళలు షిఫ్ట్ డ్యూటీలు చేసి రాత్రివేళ సురక్షితంగా ఇళ్లకు చేరుతున్నారు.ఇంటి పెత్తనం పురుషులదే అనే భావన ఉన్నా, ఇప్పుడు కుటుంబాలుగా షాపింగ్ మాల్స్‌కు వెళ్లి ఆనందంగా గడుపుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. వాకింగ్ ట్రాక్‌లలో, జిమ్‌లలో యువతులు కనిపిస్తున్నారు.ఆడపిల్లను భారంగా భావిస్తారనే బాధ ఇంకా వినిపించినా, ఇద్దరు ఆడపిల్లలను ప్రేమగా పెంచుతున్న తల్లిదండ్రుల ఉదాహరణలు కూడా పెరుగుతున్నాయి.ఉద్యోగం చేస్తున్న మహిళలకు ఇంటిపనులు తగ్గడం లేదని అంటారు. అయితే భార్యల ఎదుగుదలకు తోడుగా నిలిచే భర్తలు కూడా పెరుగుతున్నారు. విద్య, పోషకాహారం విషయంలో వివక్ష ఉందని అంటారు. అయినా పరీక్షల ఫలితాల్లో "టాపర్స్ బాలికలే" అనే వార్తలు తరచూ కనిపిస్తున్నాయి.మహిళల ఇంటి శ్రమ విలువపై కోర్టులలో కూడా చర్చ జరుగుతోంది. ఇది నిజంగా ఆలోచించాల్సిన అంశం. ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. మహిళల రక్షణకు చట్టాలు ఉన్నాయి. అయినా సమస్యలు పూర్తిగా తొలగలేదు.అందుకు కారణం వ్యవస్థలేనా? లేక వ్యక్తుల ఆలోచనా ధోరణా? అనే ప్రశ్న ముందుకొస్తుంది.

క్రీడల నుంచి అంతరిక్షం వరకు, ఫ్యాషన్ నుంచి రక్షణ రంగం వరకు ఎన్నో అడ్డంకులను దాటిన మహిళలు నారీశక్తిని నిరూపించారు. ఆ స్ఫూర్తిని మనసుల్లో నిలుపుకుందాం.గతాన్ని నిందిస్తూ, గణాంకాలను చూసి భయపడుతూ కాలం గడపడం సరిపోదు. వ్యక్తి స్థాయిలో మనం మారాలి.చట్టాలు వివక్షకు ఆంటీబయాటిక్స్ లాంటివి. ప్రభుత్వ పథకాలు సాధికారతకు విటమిన్లు. అయితే అణచివేత భావజాలానికి వ్యాప్తి నిరోధక వాక్సిన్ ఎవరు తయారు చేస్తారు? ఆలోచించాల్సిన ప్రశ్న ఇదే.నగరాల్లో వచ్చిన సానుకూల మార్పులు గ్రామాలకు చేరాలి. అందులో మీడియా కీలక పాత్ర పోషించాలి.సినిమాలు, సినీనటుల ప్రభావం కూడా పెద్దది. హీరో ఇంటిపనులు చేస్తూ, మహిళలను గౌరవించే పాత్రలు చూపితే వాటికి కూడా ఆదరణ ఇవ్వాలి.సాహితీవేత్తలు, హక్కుల ఉద్యమకారులు సమస్యల మూలకారణాలను సమగ్రంగా పరిశీలించాలి. మూల కారణం తెలిసినప్పుడే సరైన పరిష్కారం దొరుకుతుంది.ఇవన్నిటికంటే ముఖ్యంగా కుటుంబం, విద్యాసంస్థల పాత్ర అత్యంత కీలకం.

సమ సమాజం ఒక ఆదర్శం. కానీ సమదృష్టి ఒక మనస్తత్వం. దృక్పథంలో మార్పు వచ్చినప్పుడు ఆచరణ సాధ్యమవుతుంది.

ఈ భావనలు సమాజం మొత్తం ఆచరిస్తే, ఒకటి రెండు తరాల తరువాతఆకాశంలో సగం – అవనిలో సగం – అవకాశాల్లో సమం అనే లక్ష్యం సాకారం కావచ్చు.

**మార్పును సానుకూలంగా స్వీకరిద్దాం.**
**మరిన్ని ముందడుగులు వేయుదాం.**
**ఆలోచిద్దాం – ఆచరిద్దాం – ఆశిద్దాం.**



**ఎ.వి. అనిల్ ప్రసాద్**
**వరంగల్**



## మహిళల ఉద్యమాల నుండి ప్రభవించిన

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**( మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)**

19వ శతాబ్దంలోనే ప్రపంచంలోని అనేక దేశాలలో మహిళలు తమ పని పరిస్థితులను మెరుగుపరుచుకోవడా నికి పోరాటాలు ప్రారంభించారు. ఈ ఉద్యమాల ఫలితంగా 1910లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రూపుదిద్దు కుంది. ఇది శ్రామిక మహిళల హక్కుల కోసం సాగిన పోరా టాల ప్రతీకగా నిలిచింది. పని గంటల తగ్గింపు, విద్యా హక్కు, ఓటు హక్కు, సమాన పనికి సమాన వేతనం వంటి లక్ష్యాలతో మహిళల ఉద్యమం విస్తరించింది.

మార్చి 8ను అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి గుర్తించడంతో ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను ఎదుర్కొని సమాన అవకాశాలు కలిగిన సమాజాన్ని నిర్మించడమే ఈ దినోత్సవ స్ఫూర్తి. "సవాళ్లను ఎంచుకుందాం – ఐక్యంగా ప్రతిఘటిద్దాం" అన్న నినాదం మహిళా ఉద్యమాలకు ప్రేరణగా నిలుస్తోంది.

### చరిత్రలో మహిళల హక్కుల పోరాటాలు

ఒకప్పుడు మహిళలు రోజుకు 16 గంటలకు పైగా కష్టపడి, తక్కువ వేతనాలతో, హీనమైన పరిస్థితుల్లో పనిచేసేవారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా 1820లో ఇంగ్లాండులో టైలరింగ్ మహిళల పోరాటం ప్రారంభ మైంది. ఇది అనేక దేశాల మహిళలకు స్ఫూర్తినిచ్చిం ది.1908లో 15 వేల మంది మహిళలు న్యూయార్క్ నగరంలో పని గంటల తగ్గింపు, ఓటు హక్కు కోసం భారీ ర్యాలీ నిర్వహించారు. 1909లో అమెరికాలో మొట్టమొదటి "నేషనల్ ఉమెన్స్ డే" జరుపుకున్నారు. 1910లో డెన్మార్క్ రాజధాని కోపెన్‌హెగెన్‌లో జరిగిన సమావేశంలో జర్మన్ నాయకురాలు క్లారా జెట్కిన్ ప్రతిపాదనపై ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం జరపాలని నిర్ణయించారు. అప్పటి నుంచే మార్చి 8ను అంతర్జాతీయ శ్రామిక మహిళా దినంగా గుర్తించారు.

ప్రపంచవ్యాప్తంగా మహిళల పోరాటాల ఫలితంగా అనేక హక్కులు సాధించబడ్డాయి. భారతదేశంలో కూ డా మహిళా కార్మికులు మిల్లులు, జూట్ పరిశ్రమలు, తేయాకు తోటల్లో సమ్మెలు చేసి పని గంటలు తగ్గించుకోవడంతో పాటు సమాన వేతనాల కోసం పో రాటాలు చేశారు. 1975లో ఐస్లాండ్ మహిళలు లింగ సమా నత్వం కోసం చేసిన సమ్మె గుర్తింపు పొందింది.

### భారతదేశంలో మహిళల హక్కులు

మనదేశంలో కూడా మహిళల ఉద్యమాల వల్ల 8 గంటల పని దినం, ఓటు హక్కు, సమాన వేతనాలు వంటి హక్కులు సాధించబడ్డాయి. మహిళల రక్షణ కోసం జాతీయ మహిళా కమిషన్, కుటుంబ హింస నిరోధక చట్టాలు అమలులోకి వచ్చాయి. అయితే చట్టసభలలో మహిళలకు మూడవ వంతు రిజర్వేషన్ కల్పించే బిల్లు ఇంకా పూర్తిగా అమలు కాలేదు.



**ఉజ్జిని జ్యోతి**
**- శ్రామిక మహిళాపురం**

### మహిళా రైతుల సమస్యలు

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆహార ఉత్పత్తిలో 60–80 శాతం వరకు మహిళల పాత్ర ఉంది. భారతదేశంలో వ్యవసాయ రంగంలో పనిచేసే మహిళలు ఎక్కువైనా, భూమిపై యాజమాన్యం మాత్రం 8–14 శాతం మందికే ఉంది. వాతావరణ మార్పులు కూడా మహిళా రైతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.మహిళా రైతుల సంక్షేమం కోసం భూములను వారి పేరు తో నమోదు చేయడం, ఆర్థిక సహాయం అందించడం, స్వయం ఉపాధి అవకా శాలను పెంచడం అవసరం. తెలంగాణ రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడాని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మరింత బలపడాల్సిన అవసరం ఉంది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల హక్కులు, సమానత్వం, సాధికారత కోస సాగుతున్న పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



మహిళల హక్కులు..

# వారికి ఇచ్చేదెప్పుడు?

అమ్మ కడుపులోనే ఆడశిశువుగా వివక్షకు గురవడం నుంచి మహిళల బాధలు ప్రారంభమవుతాయి. పెరుగుతున్న కొద్దీ వేధింపులు, ఆంక్షలు, అనుమానాలు వారి జీవితాన్ని వెంటాడుతూనే ఉంటాయి. నచ్చినది కొనాలన్నా, పుట్టింటికి వెళ్లాలన్నా అనుమతుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఇంకా సమాజంలో కనిపిస్తూనే ఉంది. ఆర్థికంగా స్వతంత్రంగా మారినా, ఆ డబ్బుపై నిర్ణయాధికారం మాత్రం చాలాసార్లు వారి చేతుల్లో ఉండదు. రాజకీయాల్లో మహిళలు ఎన్నికై పదవులు చేపట్టినా, ఆ అధికారాన్ని వినియోగించేది చాలాసార్లు కుటుంబంలోని పురుషులే కావడం దురదృష్టకరం.

మహిళలపై జరిగే అన్యాయాలు కొత్తవి కావు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళలు భద్రతా సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట మహిళలపై దాడులు, వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ, మహిళల గురించి గొప్పగా మాట్లాడేది ఎక్కువగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజే. ఆ తరువాత పరిస్థితులు తిరిగి మామూలే కావడం చేదు నిజం.

నిజమైన మహిళా సాధికారత అంటే దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కలిగి ఉండటం. రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థికంగా, సామాజికంగా మహిళలు ఎదిగితేనే సమానత్వం సాధ్యమవుతుంది. మహిళా సాధికారత కేవలం మహిళల సమస్య కాదు; ఇది సమాజం మొత్తానికి సంబంధించిన బాధ్యత. పురుషుల సహకారం లేకుండా ఈ లక్ష్యం సాధ్యం కాదు.

మహిళలకు ఆరోగ్యం కూడా అత్యంత కీలకం. జీవితంలో ఏది సాధించాలన్నా దృఢమైన ఆరోగ్యం అవసరం. అయితే ప్రపంచవ్యాప్తంగా మహిళలు తమ జీవిత కాలంలో పురుషులతో పోలిస్తే ఎక్కువ అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటు న్నారు. విద్య, ఉపాధి, కుటుంబ బాధ్యతలను సమతుల్యం చేయడంలో వారు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు.

ప్రపంచ పార్లమెంట్లలో మహిళల ప్రాతినిధ్యం విషయంలో భారత్ పరిస్థితి ఆందో ళనకరంగా ఉంది. దేశ జనాభాలో సగం మంది మహిళలే ఉన్నప్పటికీ, పార్లమెంట్ మరియు శాసనసభల్లో వారి భాగస్వామ్యం చాలా తక్కువ. గ్లోబల్ జెండర్ గ్యాప్ సూచీలో కూడా భారత్ వెనుకబడిన స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే విషయం.

డిజిటల్ యుగంలోనూ మహిళలు అసమానతలను ఎదుర్కొంటున్నారు. ఇంటర్నెట్ వినియోగం, ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం పరిమితంగానే ఉంది. బాల్యవివాహాలు, వరకట్నం, గృహహింస వంటి సమస్యలు ఇప్పటికీ మహిళల ఎదుగుదలకు అడ్డంకులుగా నిలుస్తున్నాయి.

ఈ పరిస్థితి మారాలంటే మహిళలు ఆర్థికంగా బలపడాలి. ఉపాధి అవకాశాలు పెరగాలి. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలకు సరైన గుర్తింపు, కనీస వేతనాలు కల్పించాలి. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే "నారీ శక్తి వందన్ అధినియం" త్వరగా అమలులోకి రావాలి.

ఓ మహిళ అర్ధరాత్రి కూడా భయంలేకుండా రోడ్డుపై నడవగలిగిన రోజే నిజమైన స్వాతంత్ర్యం అని మహాత్మా గాంధీ అన్న మాటలు ఇప్పటికీ ప్రాసంగికమే. ఆ రోజు రావాలంటే మహిళల హక్కులను కేవలం మాటల్లో కాకుండా ఆచరణలో అమలు చేసే సమాజం నిర్మించాల్సిన బాధ్యత అందరిదీ.

**- డి జయరాం**
**9440485824**

# సర్వం మహిళామయమే

తల్లిగా, అక్కగా, చెల్లిగా, జీవిత భాగస్వామిగా మహిళ సమాజ నిర్మాణంలో అపారమైన పాత్ర పోషిస్తోంది. భారతీయ సంస్కృతిలో మహిళను దేవతగా గౌరవించే సంప్రదాయం ఉంది. అయితే నేటి కాలంలో కొన్ని వాణిజ్య ధోరణులు మహిళను కేవలం వస్తువుగా చూపే పరిస్థితి కూడా కనిపిస్తోంది. ప్రతి మహిళకు సమాన గౌరవం, భద్రత లభించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుంది."యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అని శాస్త్రాలు చెబుతున్నాయి. మహిళలు నిర్భయంగా జీవించగలిగే సమాజమే సుస్థిర సమాజం. నేడు మహిళలు విద్య, ఉద్యోగం, శాస్త్రం, రాజకీయాలు వంటి అనేక రంగాల్లో విజయాలు సాధిస్తున్నప్పటికీ ఇంకా వివక్ష, అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు.భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులను కల్పించింది. అయినప్పటికీ చట్టాలపై అవగాహన లోపం, పని ప్రదేశాల్లో సమస్యలు, వేతన అసమానతలు మహిళల ఆర్థిక సాధికారతకు అడ్డంకులుగా ఉన్నాయి. మహిళల భాగస్వామ్యం ఆర్థిక రంగంలో పెరిగితేనే దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుంది.మహిళల శక్తి, విజయాలను గుర్తు చేసుకుంటూ సమానత్వం కోసం ముందుకు సాగేందుకు ప్రేరణనిచ్చే రోజు అంతర్జాతీయ – మహిళా దినోత్సవం. మహిళా సాధికారతే దేశ ప్రగతికి బలమైన పునాది.

**- సుధాకర్.ఏ.వి**
**రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు**
**స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(STUTS)**
**9000674747**

# చైతన్యమే ప్రగతి దారులేస్తుంది !



అనాదిగా మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలపై మనుషులు చేసిన చైతన్యపూరిత ఆలోచనలు, కార్యాచరణలు సమాజాన్ని నిరంతరం ప్రగతిపథంలో నడిపించాయి. ఆ ఆలోచనలు, ఆవిష్కరణల వల్లే మనిషి జీవితంలో ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సామాజిక అభివృద్ధి ప్రయాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకం. జీవకోటికి ఆధారమైన ప్రకృతితో మహిళను పోల్చడం ఆమె గొప్పతనాన్ని తెలియజేస్తుంది. "మహిళలు పూజింపబడే చోట దేవతలు నడయాడుతారు" అనే నానుడి కూడా సమాజంలో మహిళ స్థానం ఎంత గొప్పదో గుర్తు చేస్తుంది.

సృష్టికి మూలమైన మహిళ అమ్మగా, చెల్లిగా, అక్కగా, భార్యగా కుటుంబానికి అండగా నిలుస్తూ సమాజంలో సగంగా నిలిచింది. అయితే చరిత్రలో ఎన్నో దశాబ్దాల పాటు మహిళలు వివక్ష, ఆంక్షలు, బాల్యవివాహాలు, సతీసహగమనం వంటి అన్యాయాలకు గురయ్యారు. దీనికి వ్యతిరేకంగా మహిళలు సంఘటితమై పోరాడి సమాన ఓటుహక్కు, సమాన పనికి సమాన వేతనం, పని గంటల తగ్గింపు వంటి హక్కులను సాధించారు. ఫలితంగా సతీ నిషేధ చట్టం, బాల్యవివాహాల నిరోధ చట్టం, వరకట్న నిషేధ చట్టం, సమాన వేతన చట్టం, గృహహింస నిరోధ చట్టం, నిర్భయ చట్టం వంటి అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి.

ఈ చట్టాలు, పోరాట స్ఫూర్తి మహిళలకు కొత్త దారులు చూపించాయి. రాజకీయాలు, పరిపాలన, ఆర్థిక రంగాలు, క్రీడలు, విమానయానం వంటి అనేక రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి, కస్తూర్బా గాంధీ, సరోజినీ నాయుడు వంటి స్వాతంత్ర్య సమరయోధులు నుండి సమ్మక్క–సారలమ్మ, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం వంటి పోరాట యోధురాళ్ల వరకు మహిళలు సమాజానికి మార్గద ర్శకులుగా నిలిచారు. ఇందిరా గాంధీ, మమతా బెనర్జీ, జయలలిత, నిర్మలా సీతారామన్ వంటి నాయకులు రాజకీయ రంగంలో తమ ప్రతిభను చాటారు. అలాగే కిరణ్ బేడీ వంటి అధికారులు, క్రీడా మరియు ఇతర రంగాల్లో రాణిస్తున్న మహిళలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఇటీవల మహిళల్లో చైతన్యం మరింత పెరిగింది. 'ఎంపవర్డ్ ఉమెన్', 'సిస్టర్ హుడ్' వంటి ఉద్యమాల ద్వారా మహిళలు పరస్పరం ఒకరికి ఒకరు అండగా నిలుస్తున్నారు. మహారాష్ట్రలో 'ఏకల్ నారీ శక్తి సంఘటన్' వంటి సంస్థలు ఒంటరి మహిళలకు భరోసా కల్పిస్తుండగా, 'ఆల్ లేడీస్ లీగ్', 'శక్తి బంధన్' వంటి సంస్థలు మహిళల అభ్యున్నతికి పనిచేస్తున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో తల్లులు పిల్లలకు పాలిచ్చేందుకు 'ఐ లవ్ నైన్ మంత్స్' వంటి వినూత్న స్టార్టప్‌లు కూడా ముందుకు వచ్చాయి.

అయితే మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నప్పటికీ సమాజంలో వారిపై హింసాత్మక ఘటనలు పూర్తిగా తగ్గలేదు. బాలికలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు వంటి సంఘటనలు మహిళల్లో భద్రతాభావాన్ని దెబ్బతీస్తున్నాయి. డిజిటల్ యుగంలో ఫోటో మార్ఫింగ్, ఆన్‌లైన్ వేధింపులు వంటి కొత్త సమస్యలు కూడా ఎదురవుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో మహిళా దినోత్సవ వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా సమస్యలపై చర్చించే వేదికలుగా మారాలి. అఘాయిత్యాలకు దారితీసే కారణాలను గుర్తించి సమాజం, పాలకులు, తల్లిదండ్రులు కలిసి పరిష్కార మార్గాలను అన్వేషించాలి. మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడం, చిన్నప్పటి నుంచే నైతిక విలువలను బోధించడం, బాధ్యతాయుతమైన సామాజిక వాతావరణాన్ని నిర్మించడం అత్యవసరం.

స్త్రీ–పురుషులు పరస్పరం సహకరించి సమానత్వం, గౌరవం ఆధారంగా కుటుంబాలను నిర్మించినప్పుడే సమాజం నిజమైన అభి వృద్ధిని సాధిస్తుంది. మహిళా దినోత్సవం ఆ దిశగా చైతన్యాన్ని పెంపొందించే, అర్థవంతమైన పరిష్కారాలను అన్వేషించే వేడుకగా మారాలని ఆశిద్దాం.

**– నర్ర భగవాన్ రెడ్డి,**
**సామాజికవేత్త**
**9492913165**

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 08.03.2026
www.mudranews.in | @mudranews



### బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు




కొలెస్ట్రాల్ అధికంగా ఉండటం. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగితే రక్తనాళాల్లో కొవ్వు పేరుకు పోతుంది. ఇది రక్తప్రవాహాన్ని అడ్డుకుని స్ట్రోక్‌కు దారి తీస్తుంది.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**




సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్లోని బీఈడ్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. విద్యార్థులు చదువులో నిబద్ధతతో ముందుకు సాగాలన్నారు. తన హయాంలో బీఈడీ కళాశాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కళాశాలకు కొత్త భవన నిర్మాణంతో పాటు అధునాతన సదుపాయాలతో లైబ్రరీని అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు మెరుగైన విద్యను పొందేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ కళాశాల నుంచి ఎంతోమంది ఉపాధ్యాయులు తయారై రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తున్నారని, ఈ కళాశాలకు గొప్ప చరిత్ర ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ నేటి విద్యార్థులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. త్వరలో డీఎస్సీ జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ ఎస్.శేఖర్, నాయకులు రఘు , కళాశాల పర్యవేక్షకులు కె.రామకృష్ణరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన సర్పంచ్, ఉపసర్పంచ్

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



దేవరకద్ర నియోజకవర్గంలోని మదనాపూర్ మండలంలోని కొన్నూర్ పెద్ద తండా గ్రామ సర్పంచ్ పాత్లవత్ లక్ష్మి నారాయణ నాయక్ , ఉపసర్పంచ్ కిషన్ నాయక్, వార్డు సభ్యులు శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఏ పార్టీ మద్దతు లేకుండా ఇండిపెండెంట్లుగా పోటీ చేసి గెలిచిన సర్పంచ్ , ఉపసర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు శంకర్ నాయక్, గోవిందమ్మ, మన్యం, బుచ్చమ్మ రమేశ్ నాయక్, ముఖ్య నాయకులు శీను నాయక్, విజయ్ నాయక్, యాది నాయక్, యువకులు, మహిళలు, తండా వాసులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై అభివృద్ధిలో భాగ్యస్వాములు కావాలన్న లక్ష్యంతో వీరందరూ కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మూడు మున్సిపాలిటీ ల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారని పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నట్లు ఆయన తెలిపారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఎస్పీ స్నేహ మెహ్రా

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు గౌరవం, సమాన అవకాశాలు లభించే సమాజంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నేటి తరం మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ సమాజ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాము లవుతున్నారన్నారు. మహిళల భద్రత రక్షణ విషయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మహిళలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, వారి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు కట్టుబడి ఉందన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం పోలీస్ శాఖ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రతి మహిళా తన హక్కులపై అవగాహన పెంపొందించుకుని ధైర్యంగా ముందుకు సాగుతూ తన లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామంలో శనివారం మహిళా దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్వేత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ చైర్మన్ వెంకటేష్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహనా కలిగి ఉండాలన్నారు. అనంతరం మహిళలు, బాలికలకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## ప్రజాసేవ చేసే వారికే టికెట్లు



**ముద్ర, కూకట్‌పల్లి:**

ప్రజాసేవలో ఉంటూ, ప్రజల అభిమానం పొందిన వారికే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టికెట్లు కేటాయిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ స్పష్టం చేశారు. శనివారం వసంత నగర్ డివిజన్‌లోని సర్దార్ పటేల్ నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నల్లచెరువును సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని వెల్లడించారు.

# కాప్రా డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ముద్ర, కాప్రా:**

ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని కాలనీల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. కాప్రా డివిజన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించేందుకు సుమారు రూ.1.07 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌లో రూ.45 లక్షలతో, శివా నగర్‌లో రూ.32 లక్షలతో, సాయిరామ్ నగర్, డిగ్నిటీ హౌసింగ్ సొసైటీ ప్రాంతంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్రుద్దీన్, ఇంద్రయ్య, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

## ఉప్పల్ భగాయత్‌లో మల్కాజిగిరి కార్పొరేషన్ కార్యాలయం

**ముద్ర, మల్కాజిగిరి:**

ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఔట్ లో నూతన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని నిర్మించనున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి కలిసి శనివారం పరిశీలించారు. మల్కాజిగిరి కార్పొరేషన్ ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సరికొత్త భవనం నిర్మించాల్సిన అవసరం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరానికి సమీపంలో ఉన్న ఉప్పల్ భగాయత్ ప్రాంతం అనువైన ప్రదేశంగా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. మూసీ నది సమీపంలో విస్తృతమైన రహదారులు, పార్కులతో అభివృద్ధి చేసిన ఉప్పల్ భగాయత్‌లో పెద్ద స్థలం అందుబాటులో ఉండటం ఈ నిర్ణయానికి కారణమని చెబుతున్నారు. గురువారం ఆకస్మికంగా అధికారులు ఆ స్థలాన్ని చదును చేయించడం కూడా ఈ ప్రాంతంలోనే కార్పొరేషన్ కార్యాలయం నిర్మాణం జరగవచ్చన్న చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నగరానికి దగ్గరగా ఉండటం, భౌగోళికంగా మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో ఉప్పల్ కేంద్ర బిందువుగా ఉండటం, విస్తారమైన స్థలం అందుబాటులో ఉండటం వంటి అంశాల కారణంగా ఇక్కడే కార్పొరేషన్ కార్యాలయం నిర్మించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

# మోడల్ గ్రేవ్ యార్డ్ గా అభివృద్ధి చేస్తాం

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**ముద్ర, కుత్బుల్లాపూర్:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని 129 – సూరారం డివిజన్ కళావతి నగర్ హిందూ స్మశానవాటిక అభివృద్ధి పనులను బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళావతి నగర్ హిందూ స్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు ఎన్ని నిధులైన కేటాయించి మోడల్ గ్రేవ్ యార్డ్ గా తీర్చిదిద్దుతామన్నారు. మనిషి జీవితంలోని చివరి మజిలీని గౌరవప్రదంగా నిర్వహించేందుకు స్మశాన వాటికలో చేపట్టవలసిన మౌలిక వసతులను అన్నింటిని కల్పించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఈ అనురాగ్, మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు రజితా రత్నం, సదానందం గౌడ్, హరినాథ్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కోలా శ్రీకాంత్ ముదిరాజ్, గుబ్బల లక్ష్మీనారాయణ, కెపి.వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# వీనుల విందుగా వశిష్ట శర్మ కచేరీ

**ముద్ర, హైదరాబాద్:**



డాక్టర్ వశిష్ట శర్మ వేణుగాన, గాత్ర కచేరీతో వృద్ధాశ్రమ వాసులకు సంగీతానందాన్ని పంచారు. సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కచేరీ అనంతరం సి ఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె. నారాయణ ఆయనను శాలువాతో సత్కరించారు. ఇటీవలే వైద్య విద్య పూర్తి చేసి ఎండీఎస్‌కు సన్నద్ధమవుతున్నప్పటికీ వేణు వాద్యంలో మంచి పట్టును సాధించడం అభినందనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. కార్యక్రమానికి వృద్ధాశ్రమ డైరెక్టర్ వి. చెన్నకేశవరావు స్వాగతం పలికారు. సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కంభంపాటి అజయ్ కుమార్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పాలి క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె. రజిని, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోస్యబట్ల కల్పన, సభ్యురాలు వయ్యకంటి లలిత, వంకా లక్ష్మి, హోం కమిటీ సభ్యులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, తానియా, ఎన్. రాజేందర్ రావు, హోం మేనేజర్ శ్రీనివాస్, ఆశ్రమ వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ వాసులు మల్లంపాటి వెంకటేశ్వరరావు, యలమంచిలి దుర్గాప్రసాద్, చెన్నమనేని వెంకట్రామారావులు డాక్టర్ వశిష్ట శర్మను ఆశీర్వదించారు.

## సీపీఐ నిరసన దీక్ష

**ముద్ర, కుత్బుల్లాపూర్:**

జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పై పోరాటం అనే నినాదంతో ప్రగతి నగర్ సర్కిల్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. దీక్షలో పాలభిందెల శ్రీనివాస్, పొన్నకంటి దస్తగిరి పాల్గొనగా, ముఖ్య అధితిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యేసురత్నం హాజర య్యారు. దళిత రత్న అవార్డు గ్రహీత మేకల. నాగేష్, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.కృష్ణ, ఆశి. యాదయ్య, బ్రహ్మానందం, కేశవులు, ప్రకాష్, నాగేష్, శివ, కృష్ణ, గంగన్న, సింధూరి, పి. కవిత పాల్గొన్నారు.

## పేదలకు భరోసా కాంగ్రెస్ ప్రభుత్వం

-జిల్లా గ్రంథాలయం చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ సర్కార్ పనిచేస్తున్నదని జిల్లా గ్రంథాలయం చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి అన్నారు. శనివారం కోయిలకొండ మండల కేంద్రంలో పలు గ్రామాల మహిళలకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందజేస్తున్నాదని, దీంతో పేదల ఇళ్లలో ఆడపిల్లల భవిష్యత్ కోసం ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. ఇదే కాక పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు రూ. ఐదు లక్షలు ప్రభుత్వం ఇస్తుందని, ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో పేదలు ఇల్లు నిర్మించుకుంటున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బిల్లులు సకాలంలో అందుతున్నాయన్నారు. అవినీతికి తావులేకుండా ఈ పథకం ముందుకు సాగుతున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవి, పార్టీ నాయకులు మల్లు సత్యపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళిక లో వీధులు శుభ్రం

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి పలు డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత కార్యాచరణ భాగంగా రోడ్లు ఊడ్చి, చెత్త ఎత్తి ప్రజలకు పరిసరాల శుభ్రం గురించి వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం కూడా మంచి గా ఉంటుందని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామంజుల రెడ్డి, కార్పొరేటర్లు, నస్రీన్ జహగీర్, అయిషా సిద్ధిఖా ముజీబ్, శ్రీలత , రామస్వామి, మంజుల , మధు మోహన్, అధికారులు పాల్గొన్నారు.

### మహిళా కళాశాలలో పారిశుధ్య పనులు

జిల్లా కేంద్రంలోని ఎన్టీ ఆర్ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని ఉద్యమం లా చేపట్టాలని కోరారు. డిగ్రీ పూర్తయిన తరువాత విద్యార్థులు ఒక లక్ష్యం ఎంచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం కళాశాల బృందం డిప్యూటీ మేయర్ ను ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎన్ సీసీ విద్యార్థులు, పాల్గొన్నారు.

## సృష్టిలో మహిళా స్థానం గొప్పది

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



సృష్టిలో మహిళ స్థానం ఎంతో గొప్పదని, ఆమె లేని సమాజాన్ని ఊహించలేమని భృంగీ విద్యా సంస్థల కార్యదర్శి ప్రమీల అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని భృంగీ విద్యా సంస్థలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల కార్యదర్శి ప్రమీల, డాక్టర్ చంద్రప్రియ మాట్లాడుతూ మహిళ లేని సమాజాన్ని మనం ఊహించలేమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి, శివప్రసాద్, డాక్టర్లు సందీప్ తేజ, వైభవ్, వైశ్నవి, అజయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### సైబరాబాద్ లో..

**ముద్ర, శేరిలింగంపల్లి:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జీహెచ్ఎంసీ కమిషనర్ సృజన హాజరుకాగా, గౌరవ అతిథులుగా 'సేవ్' ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు విజయ్ రామ్, ప్రముఖ పోషకాహార నిపుణులు, మనస్తత్వవేత్త డాక్టర్ నిదా ఫాతిమా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, వివిధ విభాగాల డీసీపీలు, పోలీస్ అధికారులు, మినిస్టీరియల్ స్టాఫ్, జీహెచ్ఎంసీ అధికారులు, రైతులు మరియు వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

### మహిళా పారిశుధ్య కార్మికులకు సత్కారం

**ముద్ర, బోడుప్పల్:**

నగరాన్ని పరిశుభ్రంగా వుంచడంలో మహిళా పారిశుధ్య కార్మికుల శ్రమ అనిర్వచనీయమని మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ అన్నారు. ఆమె ఆదేశాల మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ 10వ సర్కిల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శానిటేషన్ మహిళా కార్మికులను సన్మానిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వారికి సన్మానం చేసి అభినందనలు తెలిపారు. నగర పరిశుభ్రత కోసం వారు చేస్తున్న కృషిని అధికారులు ప్రశంసించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 08.03.2026
www.mudranews.in | @mudranews



**బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు**

అధిక బరువు (ఒబేసిటీ)
అధిక బరువు వల్ల రక్త పోటు, డయాబెటిస్ వంటి సమస్యలు వస్తాయి. ఇవి స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచే ప్రధాన కారణాలు.



# కరీంనగర్ ను వాటర్ హబ్ గా మార్చాం

**- మాజీ మంత్రి హరీష్ రావు**



**ముద్ర, కరీంనగర్:** బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కరీంనగర్ జిల్లాను వాటర్ హబ్ గా మార్చామని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తెలిపారు. శనివారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లోని కురిక్యాల వరద కాలువను మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, పలువురు బీఆర్ ఎస్ నాయకులతో కలిసి ఆయన వరద కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ఇప్పుడున్న వరద కాలువ నీళ్లు కాళేశ్వరం నీళ్లు కాదా అని ప్రశ్నించారు. చొప్పదండి, జగిత్యాల మెట్ పల్లి, బాల్కొండ నియోజకవర్గం లకు కాళేశ్వరం తోనే నీళ్లు అందించామన్నారు. వరద కాలువ కింద ఉండే రైతులకు మొక్క వేసుకుందామన్న నీరు లేని పరిస్థితి ఉందన్నారు. వరద కాలువను జీవ నదిగా మార్చింది కేసీఆర్ ప్రభుత్వం అని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ ను బీఆర్ ఎస్ ప్రభుత్వం 96 శాతం నిర్మించిదన్నార. రెండున్నర సంవత్సరాలనుంచి ముఖ్యమంత్రి మాటల చెప్పుడు తప్ప మట్టి తీసిన దాఖలాలు లేవన్నారు.

అనంతరం హరీష్ రావు చొప్పదండి నియోజకవర్గంలోని గోపాలరావుపల్లిలో రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు వారి కష్టాలను, ఆవేదనను హరీశ్ రావుకు చెప్పుకున్నారు. ప్రభుత్వం సకాలంలో చెరువులు, కుంటలు నింపకపోవడం వల్ల పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాల్వల్లో పూడిక తీయకపోవడం వల్ల నీటి సరఫరా కావడం లేదన్నారు.

భూగర్భ జలాలు తగ్గిపోవడం, సాగు నీటి సరఫరా లేకపోవడం వల్ల అప్పులు చేసి బావుల్లో పూడిక తీసినట్లు రైతులు చెప్పారు. యూరియా సరఫరా లేదన్నారు. ఓటీపీ చెప్పాలంటే మాకు తెల్వడం లేదన్నారు. యాప్స్ లో యూరియా ఎలా సుకోవాలో అర్థమయితలేదన్నారు. యూ రియా కోసం చెప్పులు లైన్లలో పెడుతున్నామని చెప్పారు.

## 'వికసిత్' లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం కేంద్రం చేస్తున్న కృషిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ ఈసీ సభ్యులు సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. స్థానిక వశిష్ఠ డిగ్రీ కళాశాలలో శనివారం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ -2026 జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పౌరులుగా వికసిత భారత్ కోసం చేయాల్సిన కృషిని వివరించారు. అనంతరం నిర్వహించిన ఉపన్యాస పోటీలో జిల్లాకు చెందిన పలు డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అర్చన, జ్యూరీ సభ్యులు డా.గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్లు మురళి, రవి కుమార్ తో పాటు శశిరాజ్ , అఖిలేష్ కుమార్ సింగ్, ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్ రవి, పలు కళాశాలల లెక్చరర్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వారు రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలుగా బాసర ట్రిపుల్ ఐటికి చెందిన సాయి చంద్, చరిత, వశిష్ఠ డిగ్రీ కళాశాల కు చెందిన సోహా మరియం, భైంసా డిగ్రీ కళాశాల కు చెందిన లక్ష్మణ్, నిర్మల్ డిగ్రీ కళాశాలకు చెందిన శేఖర్ నిలిచారు.

## ఏఐఎఫ్ బీ ప్రధాన కార్యదర్శిగా దయానంద్



**ముద్ర, హైదరాబాద్:** ఏఐ ఎఫ్ బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండ దయానంద్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్ లో అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర చైర్మన్ ఎం. జావేద్ లతీఫ్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ పలు తీర్మాణాలు చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండ దయానంద్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు గతంలో జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ ప్రకటించిన కన్వీనర్ పోస్టును ఏకగ్రీవంగా రద్దు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపా ధ్యక్షులు కట్టంగూరి బుచ్చి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొండ దయానంద్, ఆర్థిక శాఖ కార్యదర్శి కె. నరేందర్, రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మూర్తి, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు పరంగి రాము, రాష్ట్ర కమిటీ సభ్యులు సాగి అజిత్ కుమార్ రావు, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు



**ముద్ర, జగిత్యాల:** జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం స్వామివారి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు ఘనంగా జరిగాయి. అనంతరం అర్చకులు స్వామివారిని ఉసిరిక చెట్టు వాగు వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరిగి పురవీధుల్లో ఊరేగించి స్వామివారిని దేవస్థానానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, చైర్మన్ రవీందర్, సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

## మహిళా సమరానికి చట్టమే ఆయుధం



**ముద్ర, కరీంనగర్:** మహిళా సమరానికి చట్టమే ఆయుధమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శని వారం స్థానిక అపూర్వ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. రాణి ఆదేశాలతో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు, పానెల్ అడ్వకేట్ లు మాట్లాడుతూ ఆడపిల్లలకు కేవలం చదువు మాత్రమే కాదని తమను తాము రక్షించుకునే చట్టబలం కూడా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సభ్యులు పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్ర ప్రకాష్ రెడ్డి, ఏ. కిరణ్ కుమార్, పానెల్ అడ్వకేట్లు ఎస్వీఆర్ కృష్ణ, బొజ్జ శ్రీలక్ష్మి , బాశెట్టి సమతా రాణి, నాజియా కుతీజా, తిరుమణి అశ్విని, బలుసుల శాంతి కుమార్ లతో పాటు కళాశాల చైర్మన్ పి. వేణు, ప్రిన్సిపాల్ కే. మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ రాధిక పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను ఆక్రమించొద్దు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖానాపూర్ నియోజక వర్గంలో కొనసాగుతున్న మౌలిక సదుపాయాల కల్పనను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, కల్వర్టులు, వంతెనల పనుల్లో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. అటవీ శాఖ అనుమతులతో ముడిపడి ఉన్న పనుల కోసం వెంటనే పరివేశ్ పోర్టల్‌లో దరఖాస్తులు సమర్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఖానాపూర్ పట్టణ పరిధిలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సమగ్రంగా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. అటవీ క్లియరెన్స్ విషయంలో అధికారులు వేగంగా స్పందించాలన్నారు. అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా తాను చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. పనుల పురోగతిలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి కీలక దశ



**ముద్ర, ఆదిలాబాద్:** విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలక దశ అని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని సరస్వతీ నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు లక్ష్యం పేరుతో ముద్రించిన లేఖలను విడుదల చేశారు. అనంతరం పుస్తకాలను పంపిణీ చేశారు. అంతకు ముందు సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కష్ట పడి కాకుండా ఇష్టంతో చదివితే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్, ఇన్‌ఛార్జి డీఈవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

**- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి**



**ముద్ర, ఆదిలాబాద్:** రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా మోసం చేస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రంలో నిర్వహించిన రైతు పోరు బాటలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి, వాటిని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్ లో సైతం రైతులకు ఇచ్చిన అనేక హామీలు ఈ ప్రభుత్వం అమలు చేయట్లేదన్నారు. వెంటనే ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలని, ప్రతీ రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా రైతు పోరుబాట ద్వారా రైతులను నుంచి దరఖాస్తులు సేకరించి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రైతుల ఖాతాలో వేయాల్సిన రూ.9 వేల కోట్లను కాంట్రాక్టర్ల కు చెల్లించి వారి ద్వారా వచ్చే కమీషన్లు రాహుల్ గాంధీకి ముట్టచెప్పేందుకే రైతులకు రైతు భరోసా వేయలేదన్నారు. ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తులను వ ఎన్ని నెరవేర్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పటేల్, సూర్యనారాయణ, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వపురం లక్ష్మీనర్సయ్య, జిల్లా, మండల అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**ముద్ర, జగిత్యాల:** సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రాయికల్ మండలం ధర్మాజీపేట, వస్తాపూర్, కట్కాపూర్ గ్రామాల్లో రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవన నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని సూచించారు. మహిళల ఆర్థికంగా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామాల్లో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గంగారెడ్డి, తిరుపతి, పూర్ణిమ, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు క్రీడా పోటీలు

**ముద్ర, ఆదిలాబాద్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాజర్షి షా హాజరయ్యారు. థగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం పోటీల్లో అంగన్ వాడీడీ టీచర్లు, ఆశా వర్కర్ లు, మహిళా మెడికోలు, మహిళా కౌన్సిలర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి మిల్కా, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, రిమ్స్ ఆసుపత్రి సంచాలకులు జైసింగ్ రాథోడ్ పాల్గొన్నారు

## మహిళలపై వివక్ష కొనసాగుతోంది




**ముద్ర, కరీంనగర్:** ప్రపంచం మొత్తం మారుతున్నా మహిళా వివక్షలో మార్పు రాలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మారెళ్ల శ్రీలత ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ముకుంద లాల్ మిశ్ర భవన్ లో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా వివక్ష స్పష్టంగా కనిపిస్తుందోన్నారు. భారతీయ సంస్కృతి లో గొప్ప స్థానం ఉందని చెప్పినా ఆచరణలో మాత్రం మహిళలపై అనేక రూపాల్లో దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం, సమాన హక్కులు, పని ప్రదేశాల్లో రక్షణ లేకుండా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చిందని ఆరోపించారు. శ్రామిక మహిళ లోకం, ప్రజలు కలిసి నిరంతరం సంఘటిత ఉద్యమాలు చేయా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ఉప్పునూటి మానస, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ ముక్కెర బుజ్జమ్మ, శాతవాహన యూనివర్సిటీ మహిళా కన్వీనర్ దయమని, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాల్వ సారిక, జిల్లా ఉపాధ్యక్షులు నాగెల్లి పద్మ, బాయిని ప్రియంక, బూడిద రజిత, సరిత, స్వరూప, సుమలత తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు



మద్యం అధికంగా సేవించడం
ఎక్కువగా మద్యం సేవించడం రక్తపోటు పెరగడానికి కారణమవుతుంది. ఇది స్ట్రోక్ వచ్చే అవకాశాలను పెంచుతుంది.

## ఎస్సీ బాలుర వసతి గృహంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.
శనివారం రామన్నపేట మండల కేంద్రం లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.
హాస్టల్ ఉన్న వంట గది, డైనింగ్ రూమ్ ని , విద్యార్థులు పడుకునే బెడ్స్ పరిశీలించారు. డైనింగ్ రూమ్ శుభ్రంగా లేదని ప్రతి రోజు శుభ్రపరుచుకోవాలి అని తెలిపారు. ప్రతి రోజు మెనూ ప్రకారం విద్యార్థులకి మంచి నాణ్యమైన భోజనం పెడుతున్నార లేదా అని ఆరా తీశారు. విద్యార్థులకు వండే ఆహారం పరిశుభ్రంగా వంట చేయాలన్నారు. హాస్టల్ లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. మంచినీటి ఆర్. ఓ ప్లాంట్ ను పరిశీ లించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన మంచినీరు అందించాలన్నారు.
ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# సమాజ అభివృద్ధికి మహిళలు ఆదర్శంగా నిలవాలి

- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**ముద్ర, కొత్తగూడెం:**

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని అన్నారు. విద్యావంతురాలైన మహిళ అన్ని రంగాల్లో తన ప్రతిభను చాటుకుని ఉన్నత స్థాయికి ఎదగగలదని తెలిపారు. సమాజ పురోగతిలో మహిళల పాత్ర అత్యంత ముఖ్యమని అన్నారు . మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిలో చాలా సంక్షేమ కార్యక్రమాలు మహిళల పేరుమీదే మంజూరు చేయబడుతున్నాయని తెలిపారు. ప్రతి రంగంలో మహిళలు ముందుకు వచ్చి తమ సామర్థ్యాలను నిరూపిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మాట్లాడుతూ.. మహిళల పట్ల లింగ వివక్ష తొలగింపు కుటుంబ వ్యవస్థ నుండే ప్రారంభం కావాలని అన్నారు. తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారినప్పుడే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు . పనిచేసే మహిళలపై ఎటువంటి వేధింపులు జరగకుండా ఉండేలా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి స్వర్ణలత లేనినా మాట్లాడుతూ మహిళల సాధికారతకు విద్య, అవగాహన మరియు ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని అన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. "బేటీ బచావో – బేటీ పడావో" కార్యక్రమం ద్వారా బాలికల విద్య, భద్రత మరియు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు . ప్రతి కుటుంబంలో బాలికలకు సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించారు. అలాగే ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన మహిళా కార్పొరేటర్లు, సర్పంచులు, ఉప సర్పంచులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, వివిధ శాఖల మహిళా అధికారులు, కార్పొరేటర్లు, మహిళా సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు,మహిళా సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు



## 99 రోజుల కార్యాచరణతో
# సమస్యల పరిష్కారం

- **మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్**

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

99 రోజుల కార్యాచరణ ప్రణాళికలలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అందరూ సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో శనివారం వార్డు నెం.2, 7, 19, 14, 26లలో ప్రారంభించారు.
భువనగిరి పురపాలక సంఘ కార్యాలయం లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి చెత్త చెదారంను తొలగించి విరిగిపోయిన ఫర్నిచర్, కుర్చీలను ఇతర సామాగ్రిని, రికార్డు రూం నిర్వహణ ఏర్పాట్లూ, వివిధ వార్డులలో ఫాగింగ్, చెరువు కట్టల వద్ద క్లీనింగ్ వంటి పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# జీనియస్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**




మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జీనియస్ పాఠశాల ప్రాంగణంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు వారి మాతృమూర్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. మహిళ మాతృమూర్తులు కుటుంబానికి సమాజానికి పునాది లాంటి వారిని, వారి ప్రేమ త్యాగం సహనానికి నిలువెత్తు రూపాలని అన్నారు. అమ్మగా భార్యగా సోదరిగా కూతురుగా మమతాను రాగాలు పంచే స్త్రీ ఇంటిని దేశాన్ని ప్రగతి పథంలో నడిపించే శక్తి స్వరూపిణి స్త్రీ అని వారి నిస్వార్థ సేవలను గొప్పతనాలను కొనియాడుతూ వారి మనసులోని భావాలను పంచుకున్నారు. మనసుకు అహ్లాదాన్ని కలిగించే మ్యూజికల్ చైర్ అంత్యాక్షరి లాంటి ఆటపాటల కార్యక్రమాలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ బి స్వర్ణలత, ఏవో జి రవి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.




## మూడు దశల పోరాటానికి సిద్ధం

- **టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షుడు రాయబారపు రమేశ్**

**ముద్ర, ఖమ్మం:**

కేజీబీవీ, యూఆర్ఎస్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర కమిటీ పలుపుమేరకు మూడు దశల పోరాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దీనికి ఉద్యోగులు సిద్ధం కావాలని టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షుడు రాయబారపు రమేశ్, ప్రధాన కార్యదర్శి బియ్యని క్రిష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ), పట్టణ గురుకులాల్లో (యూఆర్ఎస్) బోధన, బోధనేతర సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ వైకరికి నిరసనగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నామని అన్నారు. వీటి సమస్యలు దీర్ఘ కాలంగా పరిష్కారం కాకుండా ఉండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 9న మధ్యాహ్నం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని పేర్కొన్నారు. ఇదే నెలలో 16న జిల్లా కేంద్రంలో, డివిజన్ కేంద్రాల్లో సైతం నిరసన, అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈ నెల 20 చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు.

## సింగరేణి సీఎండీని కలిసిన కలెక్టర్

**ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం:**

జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) సీఎండీ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, పరస్పర సహకారంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ పాల్గొన్నారు.



# ఎక్సైజ్ శాఖకు రూ.4 లక్షల ఆదాయం

**ముద్ర, తుంగతుర్తి:**

ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన వాహనాలకు తుంగతుర్తి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వేలం పాటలో ఎక్సైజ్ శాఖకు రూ.4 లక్షల 2 వేల ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. ఇట్టి వేలం పాటలో వాహనాల ఎంవీ ఐ అధికారి రూ.ఒక లక్ష 84 వేల 500 నిర్ధారించగా వేలం పాట ధర రూ.3 లక్షల 41 వేలు జీఎస్టీ రూ.61 వేల 380 రూపాయలు కలుపుకొని మొత్తంగా రూ. 4 లక్షల 2 వేల 380 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ వేలం పాటలో 15 ద్విచక్ర వాహనాలు ఒక మినీ డీసీఎం ను వేలంపాటలో ఉంచినట్లు తెలిపారు. వేలం పాట కు నిర్వహించే వాహనాలు చూపెట్టిన ధరలో బహిరంగ వేలం ద్వారా పాట నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే.స్టీవెన్సన్, ఈసీఐ డిటిఎఫ్ సూర్యాపేట, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు డి, మూర్తి, ఎం జయ ప్రకాష్, సిబ్బంది రామూర్తి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ సమస్యల పరిష్కారానికి
# ఇంటింటికి సిపిఎం

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

పట్టణంలోని సమస్యల తెలుసుకోవడానికి ఇంటింటికి సిపిఎంని ప్రతి కార్యకర్త జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. శనివారం సుందరయ్య భవన్ లో జరిగిన సమావేశంలో ఈ నెల 10 న భువనగిరి పట్టణ పార్టీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ కార్యవర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్య, వనం రాజు, వల్దాస్ అంజయ్య పాల్గొన్నారు.

# మహిళలను గౌరవించడం మన బాధ్యత

- **వీరనారీమణుల ఆశయసాధన సమితీ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు**

**ముద్ర, ఖమ్మం:**



గతం కంటే ప్రస్తుతం మహిళలు ప్రవేశించని రంగం, రాణించని రంగాలు ఏమీ లేవని, అన్నింటా మహిళలు దూసుకుని పోతున్నారని, కేవలం ఇల్లు మాత్రమే కాకుండా మొత్తం సమాజాన్ని తమ భుజాన మోస్తూ సంరక్షిస్తున్న వారంతా.. మహిళలే కాబట్టి మహిళలే మహారాణులని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం ముందస్తు అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని రఘునాథ పాలెం మండల కేంద్రంలో గల నిర్మాణం కానున్న సేవా లాల్ మహారాజ్ ఆలయ ప్రాంగణంలో వీరనారీ మణుల ఆశయసాధన సమితీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మహిళల ప్రాశస్త్యాన్ని, ప్రాధాన్యతను నేటి సమాజంలో వారి ఔనత్యాన్ని ప్రస్తావిస్తూ ప్రసంగించారు. తొలుత వీరనారీమణుల ఆశయ సాధన సమితీ గౌరవ సలహాదారులు, ముఖ్య అతిథి చిట్యాల స్వేత మాట్లాడుతూ.. సమాజంలో గల ద్వంద్వ ప్రవృత్తని ఎండగట్టాలని మహిళలకు తగిన గౌరవం ఇస్తామంటూనే వారిని అగౌరపరిచే పరిస్థితుల మధ్య మనం జీవిస్తున్నామని వీటికి ఎదురీదుతూనే ప్రతిఘటనాత్మక పోరాటాలు చేయాలని అప్పుడు మనకు విజయాలు దక్కుతాయని అన్నారు. మహిళలు తలుచుకుంటే అసాధ్యమనేది ఏదీ లేదని, కుంగిపోకూడదని మన మీద ఇల్లు, సమాజమే ఆధారపడి ఉండగా మనం వెనుకడుగు వేయకూడదని అన్నారు. నేటి తరం చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో ముందడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మిస్సెస్ ఇండియా ఫస్ట్ రన్నరప్ ఎంఏ.ఫర్హా మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా సమాజంలో ఉన్నటువంటి మహిళలు సామాన్య మహిళలుగా మిగలకూడదని అనుకుంటే వారు ముందుకొచ్చి జ్ఞానాన్ని సముపార్జించుకోవాలని కోరారు. మహిళలు వివక్షతకు, ఆత్మ న్యూనతకు కూడా గురికాకూడదనుకుంటే వారంతా జ్ఞానం కోసం .., ఆ జ్ఞానానికి విద్యాభ్యాసన అత్యంత ఆవశ్యకత అని అన్నారు. ఇదే సమయంలో తమ ఆరోగ్యం, తమ ఆర్థిక భద్రతలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అన్ని విషయాల్లో పరిపూర్ణత సాధించాలని అప్పుడు మహిళలకు ఎలాంటి అవరోధాలు ఉండవని తెలిపారు. సామాజిక ఉద్యమకారిణి విజయలక్ష్మీ మాట్లాడుతూ.. సమాజంలో అత్యధిక సంఖ్యాక వర్గంగా మన మహిళలే ఉన్నారని గతంలో వలే కాకుండా నేడు మనం మహారాణులు గా సమాజంలో ప్రభావ శీలులు గా జీవిస్తున్నామని అన్నారు. కారణం విద్య కాబట్టి ప్రతీ ఒక్కరు చదువుకోవాలని సూచించారు. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ మాట్లాడుతూ.. నేడు అన్నింట మహిళలే దూసుకుని పోతున్నారని అన్నారు. మహిళలకు తగిన ప్రోత్సాహం అందజేస్తే వారు మంచిగా రాణిస్తారని పేర్కొన్నారు. మహిళల పట్ల వివక్షతను ప్రదర్శించకూడదని వారికి తగిన సహకారం అందజేస్తే మంచిదని తాను కూడా మహిళల పట్ల సానుభూతితో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటానని అన్నారు. వీరనారీమణుల ఆశయ సాధన సమితీ జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీఎస్ బాణోత్ భద్రు నాయర్, రఘునాథపాలెం సర్పంచ్ గాజుల క్రిష్ణ, గిరిజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ వీరన్న నాయక్ లు ప్రసంగించగా నాయకులు భూక్యా జ్యోతి, కె.స్పందన, జాన్సీ, నాగమణి, సరోజిని, బాణోత్ ఉషా, వి.భద్రమ్మ, కవిత, లక్ష్మీ, సుభద్ర, రంగమ్మ, లక్ష్మీ నాయక్, బి. లక్ష్మీ, విజయ, షరీఫా బేగం, ప్రమీల, నద్యా నాయక్, బాలు నాయక్, సంజీవరావు, దాసరి శ్రీనివాస్, రవి నాయక్, లక్ష్మణ్ నాయక్, యాకేష్, విజయ, శ్రీనివాస చారీ, వీరన్న, డాక్టర్ రామకోటీ, నాగరాజు, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలి

**ముద్ర మోత్కూర్:**

దత్తప్పగూడెం నుండి ముషిపట్ల మీదుగా మోత్కూర్ వరకు కంకర తేలి ప్రమాదకరంగా ఉన్న రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ముషిపట్ల అరేగూడెం మధ్య రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దత్తప్పగూడెం నుండి ముషీపట్ల, అరేగూడెం గ్రామాల నుండి నిత్యం ప్రజలు వివిధ పనుల కోసం మోత్కూర్ మండల కేంద్రానికి వెళ్ళాలంటే రోడ్డు అధ్వానంగా ఉండి పూర్తిగా కంకర తేలి ఉన్నదని ఇట్టి రోడ్డును వెంటనే అధికారులు స్పందించి నూతన బీటీ రోడ్డుగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ముషీపట్ల శాఖ కార్యదర్శి పాటి శ్రీనివాస రెడ్డి, భువనగిరి యాదయ్య, వెండి యాదగిరి, కొంపల్లి గంగయ్య, చింతకింది సోమరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 08-03-2026
www.mudranews.in | @mudranews



### బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు

అధిక బరువు (ఒబెసిటీ)



అధిక బరువు వల్ల రక్తపోటు, డయాబెటిస్ వంటి సమస్యలు వస్తాయి. ఇవి స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచే ప్రధాన కారణాలు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



**- జిల్లా కలెక్టర్ హైమావతి**

ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:

జిల్లాలో గర్భస్థ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరగాలని, రోగులకు ఓపికగా మెరుగైన వైద్యం అందిస్తూ వారికి భరోసా ఇవ్వాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు.. చేర్యాల పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని గదులు తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంత ఓపి చూశారని మెడికల్ ఆఫీసర్ ను ఆరా తీశారు. వైద్య పరికరాలు, మందులు సమకూర్చుకొని, సిబ్బంది సమయ వేళలు పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఓపి వార్డులో, గర్భస్థ మహిళల వార్డులలో మహిళలతో మాట్లాడారు.. ఆసుపత్రిలో వైద్యం ఎలా ఉంది.. డాక్టర్లు ఎలా చూస్తున్నారు.. అని అడగ్గా బాగానే ఉందని రోగులు కలెక్టర్ కి తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రికి ఒక్క మహిళ కూడా వెళ్లకుండా పని చెయ్యాలని మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంలను ఆదేశించారు. అన్ని జిల్లా జనరల్ ఆసుపత్రులలో అన్ని సదుపాయాలు కల్పించాలని ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్, సిబ్బంది పైన యాక్షన్ తీసుకోవాల్సిందిగా డిఎంఅండ్ఎచ్ఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

## కలెక్టరేట్ లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్



**- పరిశీలించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**

ముద్ర ప్రతినిధి, మెదక్:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కలెక్టరేట్ లో పరిసరాల పరిశుభ్రత, పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్ చేపట్టారు. పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. అదనపు కలెక్టర్ నగేష్, ఏవో యూనస్, కలెక్టరేట్ కార్యాలయ సూపరిండెంట్లు, రెవిన్యూ సిబ్బందితో కలిసి కార్యాలయ సెక్షన్లు పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. 99 రోజుల కార్యాచరణ రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జరుగుతుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, సమస్యలుంటే పరిష్కరించాలని తెలిపారు.

## ఉన్నతమైన లక్ష్యాన్ని కష్టపడి సాధించాలి..



**- కలెక్టర్ పి.ప్రావీణ్య**

ముద్ర, సంగారెడ్డి:

ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని ఎన్ని ఇబ్బందులు ఎదురైన కష్టపడి సాధించాలని జిల్లా కలెక్టర్ పీ. ప్రావీణ్య అన్నారు. శనివారం సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్ లో సివిల్స్, గ్రూప్స్, ఆర్ఆర్బీ, బ్యాంకింగ్ పరీక్షలకు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు తన నిధులతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నోటిఫికేషన్లు ఏప్పుడు వస్తాయో తెలియదని, విద్యార్థులు శిక్షణలో పొందిన జ్ఞానానికి అదనంగా ఈ స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్

ముద్ర ప్రతినిధి, మెదక్:

కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ నగేష్, ఎలక్షన్ సూపరింటెండెంట్ గఫర్, ఎలక్షన్ సిబ్బందితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ ను కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించారు.



## ఇసుక, కంకర రవాణాను నియంత్రించాలి

**- జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య**

ముద్ర, సంగారెడ్డి:

జిల్లాలో అక్రమంగా ఇసుక, కంకర, రవాణాను కట్టుదిట్టంగా నియంత్రించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వాల్టా చట్టంతో పాటు మోటార్ వాహనాల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. శనివారం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, భూగర్భజల శాఖ అధికారులతో అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణా నివారణపై చర్చించారు. జిల్లాలో వాల్టా చట్టం అమలు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అవగాహన, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, ఎస్ఐఆర్ నమోదు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జిల్లాలో ఇసుక, కంకర అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. ఫిల్టర్ సాండ్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,



సహజ ఇసుకకు బదులుగా కృత్రిమంగా ఇసుక తయారు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన ఇసుకను నిర్ణీత ధరలకే అందిస్తోందని, దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నారాయణ ఖేడ్, జోగిపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ల ద్వారా ఇసుకను నిర్ణీత ధరలలో అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి జిల్లాలో ఇసుక కొరత లేదని స్పష్టం కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వినియోగానికి తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు నమోదు చేసిన అక్రమ రవాణా కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కుల, ఆదాయ, నివాస ధృవపత్రాల జారీ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం పై మండల, గ్రామ స్థాయిలలో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా భూగర్భ శాఖ అధికారి ఎం.రఘుబాబు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక వసతులు బేష్..

**- కేంద్ర నోడల్ ఆఫీసర్ అమన్ శర్మ**

ముద్ర, సంగారెడ్డి:

సంగారెడ్డి జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు చాల బాగున్నాయని కేంద్ర నోడల్ ఆఫీసర్ అమన్ శర్మ ప్రశంసించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ హాల్ లో కలెక్టర్ పీ. ప్రావీణ్య, డీఈవో వెంకటేశ్వర్లుతో కలిసి పీఎం శ్రీ పాఠశాలల అమలు పురోగతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ జాతీయ విద్యా విధానం 2030వ సంవత్సరం వరకు ఉన్నతమైన లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన వృత్తి విద్యలను అందించాలన్నారు. సంగారెడ్డి జిల్లాలో 44 ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు మోడల్ స్కూల్స్ లో పీఎం శ్రీ పథకం అమలులో ఉం దని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం డిప్యూటీ డైరెక్టర్ జనార్ధన్ రావు, స్టేట్ అకాడమిక్ మానిటరింగ్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ జావిద్, సమగ్ర శిక్ష అబభియాన్ సంగారెడ్డి జిల్లా కో–ఆర్డినేటర్లు బాలయ్య, వెంకటేశం, సునీత, కన్నా, తాజుద్దీన్, మాధవి, పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

**- అదనపు ఎస్పీ మహేందర్**

ముద్ర ప్రతినిధి, మెదక్:

దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి యువతలోనే ఉందని అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ అన్నారు. శనివారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్–2026 కార్యక్రమంలో భాగంగా 50 సంవత్సరాల అత్యవసర పరిస్థితి – భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు అనే అంశంపై జిల్లా స్థాయి పోటీలు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగ విలువలు, ప్రజల హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు గౌరవించాలని సూచించారు. యువత దేశ చరిత్ర, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. యూత్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వాక్చాతుర్యం, చర్చా నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. అలాగే యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

**- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు**

**- సిద్దిపేటలో ఖాళీ సిలిండర్‌తో నిరసన**



ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. సీపీఎం సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కమాన్ వద్ద ఖాళీ గ్యాస్ సిలిండర్‌తో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే విధంగా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచిందన్నారు. వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.115 పెంచడం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల ధరలు పెరిగి ప్రజలపై అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అలాగే గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.60 పెంచడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగి దేశ స్వతంత్ర విధానాలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తోందని అన్నారు. ప్రపంచ శాంతిని కాపాడే విధంగా అలీన విధానాన్ని అమలు చేసి యుద్ధాలు ఆపేందుకు కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుపర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగర వెంకట్, బద్దిపడగ కృష్ణారెడ్డి, చొప్పరి రవికుమార్, పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

ముద్ర, మెదక్:



అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై తెలిపిన ప్రకారం.. గిరిజన తండాకు చెందిన వడిత్య అనిల్(25) జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో కారు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. శనివారం గ్రామ శివారులోని గిద్దమచెరువు కట్టపై బైకు, చెప్పులు కనిపించగా గ్రామస్తులు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. తండాకు చెందిన అనిల్‌గా గుర్తించి పోస్టుమార్టం కోసం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు, అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు పంపిణీ




ముద్ర ప్రతినిధి, మెదక్:

హవేలీ ఘనపూర్ మండల పరిధిలో పీఎంశ్రీ కూచన్ పల్లి ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు భగవాన్ శ్రీ సత్య సాయి సేవ సమితి మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వామి వారి శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని 103 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి సేవ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు శిరిగా ప్రభాకర్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుండి ప్రారం భం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు ప్రణాళికతో చదివి పరీక్షా హాల్లో ఎలాం టి భయాందోళనకు, ఒత్తిడికి గురి కావద్దని సూచించారు. హెచ్ ఎం నాచారం మధు మోహన్ మాట్లాడుతూ ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు రాకుండా సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పరీక్షల్లో విద్యార్థులు 100% ఫలితాలు వచ్చే విధంగా ఈ నెల రోజులు కష్టపడాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మెదక్ సత్యసాయి సేవా సమితి సభ్యులు నగేష్, మోటివే షన్ ఊరటి నరసింహులు, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్, పంతంగి శ్రీనివాస్, ఎల్. మల్లారెడ్డి, కొండల్ రెడ్డి, ఎల్లం, రాజు, వినోద్, సంతోషి కుమారి, శ్రీనివాస్, శశి కుమార్, కృష్ణవేణి, చక్రపాణి, శశి కుమార్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేస్తాం

ముద్ర, నిజామాబాద్:

అందరి భాగస్వామ్యంతో జిల్లాలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'ను పూర్తి స్థాయిలో విజయవంతం చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. శనివారం నిజామాబాద్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 2–కే రన్‌ను నిర్వహించారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు నుంచి చేపట్టిన ఈ రన్‌ను కలెక్టర్, అర్బన్ ఎమ్మెల్యే సూర్య నారాయణ గుప్తా, నగర మేయర్ ఉమారాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సరికొత్త ఆలోచనలతో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రవి బాబు, తహసీల్దార్ విజయ్ కాంత్‌రావు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు**

**వ్యాయామం లేకపోవడం**
శారీరక చలనం లేకపోతే శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. దీని వల్ల హృదయ సంబంధిత సమస్యలు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది.



## తెలంగాణ డెలావేర్ మధ్య సహకారానికి కొత్త దిశ

- సీఎంతో డెలావేర్ రాష్ట్ర గవర్నర్ భేటీ
- ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చ
- పలు రంగాల్లో పరస్పర సహకారంపై అంగీకారం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అమెరికాలోని డెలావేర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ శనివారం సీఎం రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో తెలంగాణ, డెలావేర్ రాష్ట్రాల మధ్య భవిష్యత్తులో కొనసాగాల్సిన ద్వైపాక్షిక సంబంధాలు, పలు రంగాల్లో పరస్పర సహకారంపై సుదీర్ఘంగా చర్చించారు. సీఎంతో పాటు కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డెలావేర్ ఫస్ట్ లేడీ లారెన్ మేయర్తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించే యూనివర్సల్ హెల్త్ కేర్ విధానాలపై చర్చించారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆధునిక బోధనా పద్ధతుల అమలుపై చర్చలు జరిపారు. సాంకేతిక యుగంలో సమాచార భద్రత, డేటా ప్రొటెక్షన్ చట్టాలపై ఇద్దరూ తమ అభిప్రాయాలు పంచుకున్నారు. డెలావేర్ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల కోసం అమలు చేసిన గృహ నిర్మాణ పథకాలు, రుణమాఫీ వంటి అంశాలను గవర్నర్ సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని గవర్నర్ మాట్ మేయర్ అభినందించారు. ఇదే క్రమంలో తెలంగాణ ప్రతినిధుల బృందంతో కలిసి డెలావేర్ రాష్ట్రానికి పర్యటనకు రావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. రెండు రాష్ట్రాల మధ్య ఆర్థిక, సాంకేతిక బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## విధి నిర్వహణలో సైబరాబాద్ మహిళా పోలీసుల ప్రతిభ

**ముద్ర, శేరిలింగంపల్లి:**

సైబరాబాద్ మహిళా పోలీసులు వీధి నిర్వహణలో తమ ప్రతిభ, అంకితభావంతో గుర్తింపు పొందుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలోనే కాకుండా, అధికారిక కార్యక్రమాల్లోనూ తమదైన ముద్ర వేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

క్రమశిక్షణకు నిదర్శనం

అక్టోబర్ 21న నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా, మహిళా పోలీస్ అధికారులు క్రమశిక్షణతో కూడిన పరేడ్‌లో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కవాతులో వారు ప్రదర్శించిన ఏకాగ్రత, సమన్వయం, వృత్తిపరమైన అంకితభావం పరేడ్‌కు మరింత గౌరవాన్ని చేకూర్చింది. నగరానికి విచ్చేసే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులకు ఇచ్చే 'గార్డ్ ఆఫ్ హానర్', వారి సమయపాలన మరియు బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అద్దం పడుతోంది.

**అప్రమత్తమైన భద్రత..**

కేవలం పగటి విధులతోనే పరిమితం కాకుండా, మహిళా పోలీసులు రాత్రి సమయాల్లోనూ అత్యంత అప్రమత్తతతో సెంట్రీ విధులను నిర్వర్తిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని కీలక ప్రాంతాలు, కార్యాలయాల వద్ద నిరంతరం కాపలా కాస్తూ నగర భద్రతా వ్యవస్థలో తమవంతు కీలక పాత్ర పోషిస్తున్నారు.

సృజనాత్మకతలోనూ..

వృత్తిపరమైన బాధ్యతలతో పాటు, హోం గార్డ్స్ వార్షికోత్సవం వంటి అధికారిక కార్యక్రమాల్లో మహిళా పోలీసులు వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తూ తమలోని సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నారు. సభలను సమర్థవంతంగా నడిపిస్తూ, తమ వాగ్ధాటితో కార్యక్రమ నిర్వహణను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

**సీపీ ప్రత్యేక అభినందనలు..**

ప్రతిష్ఠాత్మక 'మిస్ వరల్డ్' పోటీల బందోబస్తు విధుల్లో మహిళా పోలీసులు ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరును పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా కొనియాడారు. క్లిష్టమైన పరిస్థితుల్లో వారు చూపిన అంకితభావాన్ని గుర్తిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉన్నతాధికారుల నుంచి అందుతున్న ఈ గుర్తింపు, ఇతర మహిళా సిబ్బందికి స్ఫూర్తినిస్తోంది.

**సీపీఆర్‌తో ప్రాణ రక్షణ...**

విధి నిర్వహణలో మహిళా పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, ప్రాణదాతలుగానూ నిలుస్తున్నారు. పరిగి నుంచి విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ముగ్గురు ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లు దీపశ్రీ, వనజ, పద్మలు ప్రమాద స్థలిలో చూపిన చొరవ అభినందనీయం. ప్రమాదానికి గురైన బస్సు వెనుక ప్రయాణిస్తున్న వీరు, ఘటన జరిగిన ఐదు నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్నారు. క్షణమాత్రం ఆలస్యం చేయకుండా, మరో ఏడుగురు కానిస్టేబుళ్లతో కలిసి మొత్తం 11 మంది క్షతగాత్రులకు సీపీఆర్ నిర్వహించి, వారి ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారు. బాధితులు స్పృహలోకి రాగానే వెంటనే వారిని ఆస్పత్రులకు తరలించారు.

**గాయాలను లెక్కచేయని ఉక్కు సంకల్పం..**

ఇటీవల చేవెళ్ల బస్సుటిప్పర్ ఢీకొన్న ఈ ఘటనలో పోలీసులు గాయాలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. చేవెళ్ల, వికారాబాద్, పరిగి సబ్ డివిజన్ల నుంచి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ నియంత్రిస్తూనే, ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీశారు. ఫైర్ సిబ్బందితో కలిసి వెల్డింగ్ కట్టర్ల సాయంతో బస్సు రాడ్లను తొలగించి బాధితులను కాపాడారు. ఈ క్రమంలో పలువురు మహిళా పోలీసులు కు స్వల్ప గాయాలయ్యాయి. సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడిన మహిళా పోలీసుల సేవాదృక్పథాన్ని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.



## ప్రతిభ, నైతికత, కరుణ వైద్య వృత్తిలో మూల సూత్రాలు

- నిత్య విద్యార్థులే ఉత్తమ వైద్యులు అవుతారు
- ఆర్మీ కాలేజ్ఆఫ్ డెంటల్ సైన్సెస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

వైద్య వృత్తిలో ప్రతిభ, నైతికత, కరుణ మూల సూత్రాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. ఆధునిక ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నిత్యం అధ్యయనం చేస్తూ వృత్తిని కొనసాగించే వారే ఉత్తమ వైద్యులుగా గుర్తింపు సాధిస్తారని వెల్లడించారు. శనివారం సికింద్రాబాద్ లోని ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. చదువు ఎప్పుడూ ముగియదని వైద్య రంగం మనకు నేర్పే ముఖ్యమైన పాఠం అన్నారు. శాస్త్రీయ జ్ఞానం మారుతూ ఉంటుందన్న ఆయన అదే స్థాయిలో సాంకేతికత కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. రోగుల అవసరాలు సైతం మారుతుంటాయన్నారు. జీవితాంతం విద్యార్థులుగా ఉండే వైద్యులే ఉత్తమ వైద్యులు అవుతారని చెప్పారు. వృత్తిపరమైన ప్రతిభను కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. అలాగే జ్ఞానం, నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలన్నారు. నైతికత, నిజాయితీతో సేవ చేయాలని సూచించారు. రోగుల నమ్మకం ఆరోగ్య సేవల పునాది అన్న భట్టి.. కరుణను ఎప్పటికీ మర్చిపోవద్దని సూచించారు. వైద్య సేవల హృదయం మానవ సేవే అన్నారు. విద్య, క్రమశిక్షణ, సమాజ సేవకు అంకితభావంతో సాగిన 25 ఏండ్ల జీవన ప్రయాణాన్ని మనం ఈ రోజు స్మరించుకుంటున్నామని చెప్పారు. ఇది కేవలం ఒక విద్యాసంస్థ ప్రయాణాన్ని మాత్రమే కాదన్నారు. భవిష్యత్తులో ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లబోయే కొత్త తరపు ఆరోగ్య నిపుణుల విజయాలను జరుపుకునే రోజు అని తెలిపారు. 2026లో పట్టభద్రులైన అందరికీ, ఈ కాన్వకేషన్ ఒక ముఖ్యమైన మైలురాయి అన్నారు. ఎన్నో ఏండ్ల కృషి, అనేక రాత్రుల చదువు, క్లినికల్ శిక్షణలో గడిపిన గంటల సమష్టి ఫలితమే ఈ రోజు అని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. అంతకంటే ముఖ్యంగా, ఇది ఒక కొత్త అధ్యాయం ప్రారంభమని చెప్పారు. ఇకపై మీరు సంపాదించిన జ్ఞానం సమాజ సేవగా మారాల్సిన సమయం ఆసన్నమైంది అన్నారు. డెంటిస్ట్రీ, వైద్య రంగంలోని ఇతర శాఖల మాదిరిగానే, కేవలం ఒక వృత్తి మాత్రమే కాదన్న భట్టి... అది ప్రజల నమ్మకానికి ప్రతీక అన్నారు. మీ క్లినిక్‌లోకి వచ్చే ప్రతి రోగి వైద్య సహాయం మాత్రమే కాకుండా మీ నిర్ణయం, మీ దయపై విశ్వాసంతో వస్తాడన్నారు. నేడు పట్టభద్రులలో పెద్ద సంఖ్యలో యువ మహిళలు ఉండటం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇది మన సమాజంలో జరుగుతున్న ఒక మంచి మార్పును సూచిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమేష్ రెడ్డి, తెలంగాణ డెంటల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కె .రాజేష్ రెడ్డి, మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మమత కౌశిక్ పాల్గొన్నారు.

## 99 రోజుల్లో లక్ష్యాలను చేరుకోవాలి

- హౌసింగ్ బోర్డు పరిధిలోని 5వేల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- తెలంగాణ హౌసింగ్ బోర్డు రిజిస్ట్రేషన్ పోర్టల్ ప్రారంభం




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

99 రోజుల ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న 5వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ఆయన శనివారం సచివాలయంలో ప్రారంభించారు. దీంతో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డ్ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డు పరిధిలో ఇండ్లు, ఫ్లాట్లు, స్థలాలను వాయిదాల రూపంలో కొనుగోలు చేశారని తెలిపారు. ఇందులో కొంతమంది అసలు మరి కొంత మంది వడ్డీలు చెల్లించాలని, ఇంకొంతమంది వాయిదాల గడువు ముగిసిపోయిందన్నారు. ఈ విధంగా దాదాపు ఐదు వేల మంది తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిఉందని అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ పోర్టల్ తో ప్రజలు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదన్నారు. పూర్తి సమాచారం పోర్టల్ లోనే ఉంటుందన్నారు. కేటాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ, ఇతర లావాదేవీల పర్యవేక్షణను ఒకే వేదిక ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. డిజిటల్ విధానంతో పారదర్శకత పెరగడంతో పాటు పౌరులకు సేవలు మరింత చేరువవుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

## డేంజర్ బెల్స్

- 12 రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు
- ఈ నెల నుంచే తెలంగాణలో ఊహకందని వడగాల్పుల తీవ్రత
- భారత వాతావరణ శాఖ హెచ్చరిక

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




తెలంగాణలో డేంజర్ బెల్స్ మోగనున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఈ నెలాఖరు నుంచే వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణతో పాటు 12 రాష్ట్రాల్లో ఈ నెలలోనే సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో మార్చి నుంచి మే వరకు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుండి 5 డిగ్రీలు అదనంగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించింది. మరోవైపు తగినన్ని నీళ్లు తాగుతూ డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్త పడాలని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు ఎండల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. రాబోయే 3 రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని వాతావరణ శాఖ సూచించింది. కాగా ఈ ఏడాది వర్షాలతో పాటు, చలి, ఎండలు అధికంగా ఉంటాయని భారత వాతావరణ శాఖ ముందే అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా వర్షాలు, చలి తీవ్రత అధికంగా కనిపించింది. తాజాగా ఎండలు సైతం మార్చి మొదటి వారంలోనే చుక్కలు చూపిస్తున్నాయి. ఉదయం 8 గంటలకే సూర్యప్రతాపం చూపిస్తుండటంలో బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు.

## ప్రజా సమస్యల పై సీపీఐ పోరాటం

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం

**ముద్ర, కుత్బుల్లాపూర్:**

జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పై పోరాటం అనే నినాదంతో ప్రగతి నగర్ సర్కిల్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ నిరసన దీక్షలో పాలభిందెల శ్రీనివాస్, పొన్నకంటి దస్తగిరి పాల్గొనగా, ముఖ్య అధితిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యల పై సీపీఐ పోరాటం అనే నినాదంతో నిరసన దీక్ష నిర్వహించారు. నిజాంపేట్ సర్కిల్లో అంబీర్ చెరువు, తూర్క చెరువు, బైన్ చెరువు, పాపయ్య కుంట, కొత్త కుంట మొదలైన వాటిలో గుర్రపు డెక్కలు పెరగడం వల్ల వాటిని ఆసరా చేసుకొని దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయని అన్నారు. గుర్రపు డెక్కలను తొలగించి, తరువాత దోమలను నివారించాలి అని అన్నారు. అలాగే నిజాంపేట్ సర్కిల్ పరిధిలో రోడ్లు , డ్రైనేజ్ పెండింగ్ పనులు పూర్తి చేయకపోవడం వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని అన్నారు. వెంటనే రోడ్లు, డ్రైనేజ్ పనులు పూర్తి చేయాలని అన్నారు. బస్తీ దవాఖానాలలో డాక్టర్లు, నర్సుల కొరత వల్ల నిరూపయోగంగా ఉన్నాయని వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎండ కాలం వచ్చింది కనుక ప్రజలకు మంచి నీటి కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. 90 శాతం అక్షరాస్యత గల నిజాంపేట్ సర్కిల్లో గ్రంథాలయం లేదని, వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, బాచుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయానికి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి వెళ్తే కనీసం కూర్చోడానికి స్థలం లేక పాత బాచుపల్లి గ్రామపంచాయితీ కార్యాలయాన్ని వాడుతున్నారని, వెంటనే తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే నిజాంపేట్ సర్కిల్లో పని చేసే మున్సిపల్ కార్మికుల, చెత్త బండి నడిపే కార్మికుల, చిరు వ్యాపారుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత మేకల. నాగేష్, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.కృష్ణ, ఆశి. యాదయ్య, బ్రహ్మానందం, కేశవులు, ప్రకాష్ , నాగేష్, శివ, కృష్ణ, గంగన్న, పి. సింధూరి, పి. కవిత పాల్గొన్నారు.

## జేఎన్టీయూలో ఘనంగా 'స్టాండ్ విత్ హర్'

- ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర కూకట్‌పల్లి**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం జేఎన్టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి చేరుకోగానే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రికి పూల మొక్కను అందజేసి సాదరంగా వేదిక వద్దకు ఆహ్వానించారు. మహిళా సాధికారత, భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా సీఎం కొనియాడారు. ఈ పర్యటనలో భాగంగానే కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి, బండి రమేశ్ చర్చించుకున్నారు. ముఖ్యంగా రాబోయే సోమవారం ముఖ్యమంత్రి చేతు ల మీదుగా ప్రారంభం కానున్న నల్లచెరువు పార్కు ఏర్పాట్లపై ఇరువురు నేతలు చర్చించారు. కూకట్‌పల్లి వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా హైడ్రా ఆధ్వర్యంలో ఈ చెరువును సుందరీకరించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, సీపీ సజ్జనార్, సినీ నటుడు సాయి ధరం తేజ్ మరియు ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



**బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు**

హృదయ సంబంధిత వ్యాధులు

హృదయ వ్యాధుల వల్ల రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉంటుంది. ఆ గడ్డలు మెదడుకు వెళ్లి రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటాయి.

# మహిళల రక్షణకు పురుషులు బ్రాండ్ అంబాసిడర్లు కావాలి

- వారి భద్రత, గౌరవం, సమానత్వాన్ని కాపాడాలి
- మహిళా భద్రత సామాజిక బాధ్యత
- ఆడబిడ్డలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం కావాలి
- మహిళా భద్రత, ఆర్థిక స్వావలంబనకు సర్కార్ చర్యలు
- స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**





సమాజంలో మహిళల రక్షణ కోసం మగవారే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలబడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఫిర్యాదులు, కేసుల నమోదుతో పాటు మహిళల భద్రతను ఒక సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ఆడ పిల్లలను ఎవరైనా ఇబ్బందికి గురిచేసినప్పుడు నిలబడి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని యువతకు సూచించారు. వేధింపులను చూసి చూడనట్టు ఉండటం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అవుతుందని హితవుపలికిన సీఎం.. సొంత కుటుంబ సభ్యులకు ఎక్కడైనా వేధింపులు ఎదురైతే ఏ విధంగా స్పందిస్తామో, ఇతర ఆడపిల్లల విషయంలోనూ అదే తీరుగా ఆలోచించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ జేఎన్‌టీయూ క్యాంపస్ ఆడిటోరియంలో తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "స్టాండ్ విత్ హర్" క్యాంపెయిన్ ప్రారంభ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాండ్ విత్ హర్ క్యాంపెయిన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మహిళల భద్రత, గౌరవం, సమానత్వాన్ని కాపాడడంలో పురుషులు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాల్సిన అవసరాన్ని తెలియజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన విమెన్ సేఫ్టీ విభాగాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రతతో పాటు వారి ఆర్థిక స్వావలంబన కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమాల నిర్వహిస్తే బాధ్యత తీరిపోయినట్టు కాదన్నారు. మహిళను శక్తితో పోల్చుతామనీ వారిని కుటుంబ గౌరవంగా భావిస్తామని చెప్పారు. అలాంటిది మహిళలు నిత్యం అభద్రతా భావంతో బయటికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండకూడదని అభిప్రాయపడ్డారు. ఈ దుస్థితిని నివారించేలా మనల్ని మనం సవరించుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఒక మహిళ సారథ్యంలో ఉన్న పార్టీ ఇప్పుడు తెలంగాణలో ప్రభుత్వాన్ని నడుపుతోందని చెప్పారు.. దేశ స్వతంత్రానికి ముందు, ఆ తర్వాత కూడా మహిళలకు కీలక పదవులు, బాధ్యతలు కట్టబెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. నాడు తెలంగాణ ఏర్పాటులోనూ మహిళామణులే కీలకంగా వ్యవహరించారని చెప్పారు. మహిళల శక్తిసామర్థ్యాల పట్ల మా ప్రభుత్వానికి బలమైన నమ్మకం ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ శాఖలోని కీలక విభాగాలకు, ప్రభుత్వంలోని ముఖ్యమైన శాఖలకు మహిళలే అధికారిణులుగా ఉన్నారన్న సీఎం... ఆడబిడ్డలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతమైతేనే ఆ రాష్ట్రం లేదా దేశం పురోగతి సాధించినట్టుగా భావించాలన్నారు.

**మహిళా సాధికారిత కు కృషి**

తెలంగాణలో మహిళా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళ కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు, వడ్డీలేని రుణాలు మహిళల పేరుమీదే ఇస్తున్నాం. సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు, ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేస్తున్నామని వివరించారు. తెలంగాణ గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను అంతర్జాతీయంగా విక్రయించేలా అమెజాన్ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామన్న ఆయన మహిళా యూనివర్శిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఆడబిడ్డనే స్ఫూర్తిగా ఉండాలని 'తెలంగాణ తల్లి' మూర్తులను ప్రతిష్టించుకున్నామని వివరించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్య సాధనలో మహిళల ముందడుగే కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించడంతోనే తెలంగాణ రాష్ట్రం మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించడంతోనే ఇవన్నీ నెరవేరుతాయని చెప్పారు. గతంలో కొన్ని ప్రాంతాల్లోనో, బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు వేధింపులు ఎదురయ్యేవన్నారు. కానీ ఈ రోజుల్లో ఫిజికల్ క్రైమ్ కంటే ఆన్‌లైన్ క్రైమ్ పెరిగిపోయిందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. డీప్ ఫేక్ వీడియోలు తయారు చేస్తూ మహిళలను వేధిస్తున్నారని మండిపడ్డారు. వీటిని నియంత్రించడానికి తెలంగాణ సైబర్ క్రైమ్ విభాగాన్ని కూడా పటిష్టం చేసినట్లు సీఎం వివరించారు. ఏదైనా జరిగినప్పుడు అమ్మాయిదే తప్పు అని నిందలు వేసే చెడు సంప్రదాయాన్ని మనం వదులుకోవాలని విపక్షాలకు సూచించారు. ఇబ్బందుల్లో ఉన్న మహిళల కోసం 'స్టాండ్ విత్ హర్' అనే నినాదం తీసుకొని వారికి అండగా నిలబడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి, విమెన్ సేఫ్టీ విభాగం అడిషనల్ డీజీపీ చారు సిన్హా, సినీ నటుడు సాయి ధరమ్ తేజ్, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు

- సీఎం వ్యాఖ్యలపై రఘునందన్ స్పందన

**ముద్ర, హైదరాబాద్:**



రిటైర్ అయిన ఉద్యోగులకు చెల్లించే మొత్తాలు ప్రభుత్వం ఇచ్చే "రిటైర్మెంట్ బెనిఫిట్స్" కావని, అవి వారి సర్వీస్ కాలంలో దాచుకున్న రిటైర్మెంట్ బకాయిలు మాత్రమే అని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఇంజమూరి రఘునందన్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఉద్యోగుల కృతజ్ఞతా సభలో మాట్లాడుతూ ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉందని, ప్రతి నెల వెయ్యిమంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారని, ఒక్కొక్కరికి కోటి రూపాయల వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్న విషయంపై ఆయన స్పందించారు. ప్రతి రిటైర్ అయిన ఉద్యోగికి కోటి రూపాయలు ఇవ్వాల్సి వస్తుందనే వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని తెలిపారు. సాధారణంగా ఉద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో సగటున రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు మాత్రమే బకాయిలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు తమ సేవా కాలంలోనే వేతనాల నుంచి జమచేసుకున్న జీపీఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్ (GIS), టీజీఎల్ఐఎఫ్ వంటి నిధులు రిటైర్మెంట్ సమయంలో తిరిగి చెల్లిస్తారన్నారు. అలాగే వాడుకోని సెలవులకు ఇచ్చే లీవ్ ఎన్‌కాష్మెంట్, పెన్షన్‌లో కొంత భాగాన్ని ముందుగా తీసుకునే కమ్యుటేషన్ ఆఫ్ పెన్షన్ కూడా ఉద్యోగుల హక్కులేనని వివరించారు. ప్రభుత్వం అదనంగా ఇచ్చేది ప్రధానంగా గ్రాట్యుటీ మాత్రమే అని చెప్పారు. సుప్రీంకోర్టు కూడా 1982 డిసెంబర్ 17 తీర్పులో "పెన్షన్ అనేది ప్రభుత్వాల భిక్ష కాదు.. ఉద్యోగుల చట్టబద్ధ హక్కు" అని స్పష్టం చేసినట్లు ఆయన గుర్తు చేశారు. మార్చి 2024 నుంచి ఇప్పటివరకు తమకు రావాల్సిన రిటైర్మెంట్ బకాయిలు అందక ఆర్థిక ఇబ్బందులతో 61 మంది పెన్షనర్లు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించి పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు.

రిటైర్మెంట్ సమయంలో విశ్రాంత జీవితం గడపాల్సిన పెన్షనర్లు ధర్నాలు, ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిగణనలోకి తీసుకొని త్వరగా పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.





## కుటుంబాన్ని ముందుండి నడిపించేది మహిళే

- అన్ని రంగాల్లో మహిళలు రాణించి సాధికారత సాధించినపుడే మహిళా దినోత్సవం స్ఫూర్తి నిలుస్తుంది
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచన

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**

మహిళలు అన్ని రంగాలలో రాణించి, సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా గెజిటెడ్ ఆఫీసర్సు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మార్పు అనేది ఇంటి నుండే ప్రారంభం కావాలన్నారు. విశ్వంలో చాలా గ్రహాలు ఉన్నాయని, భూమి పైన మాత్రమే ప్రాణం ఉన్న జీవులు జీవిస్తున్నాయని, అందులో మానవ జీవితం చాలా ఉత్తమమైందన్నారు. పురుషులు, స్త్రీల కంటే ముందు మనం మనుషులం, ఆడ, మగా కలిసి ప్రయాణిస్తేనే అర్థం, పరమార్థమని అన్నారు. స్త్రీ పురుషులిద్దరు ఒక బండికి జోడెద్దులుగా ప్రయాణం చేసినప్పుడే సమాజంలో ముందుకు వెళ్ళడం జరుగుతుందన్నారు. కుటుంబానికి మూలం ఆ కుటుంబంలో ఉన్న మహిళా అని, కుటుంబంలోని ప్రతి విషయంలో మహిళ సమతూల్యత కలిగి ఉంటుందన్నారు. మనందరికీ అమ్మే మొదటి దైవం, మనందరిని ఆమెనే ముందుండి నడిపిస్తుందని కొనియాడారు. పాత కాలంలో మహిళల పట్ల వివక్షత ఉండేదని, కొన్ని ప్రాంతాల్లో నేటికీ మహిళలపై వివక్షత కొనసాగుతుందన్నారు. ఇప్పుడిప్పుడే మహిళలకు విద్యా, ఆర్థిక అంశాల్లో సమానంగా అవకాశాలు దక్కుతున్నాయన్నారు. మారుతున్న నేటి కాలంలో అక్షరాస్యత టెక్నాలజీ పెరగడం ద్వారా ఈ వివక్ష తగ్గిందన్నారు. అబ్బాయిలను అమ్మయిలను సమానంగా పెంచాలని, పిల్లలకు విలువలతో కూడిన విషయాలు నేర్పించాలని కలెక్టర్ సూచించారు. కుటుంబం, కుటుంబంలోని బంధాలు, విలువలు మర్చిపోకుండా ఉన్నప్పుడే సమాజాన్ని కాపాడుకోగలమని అన్నారు. మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించే ప్రతిఫలాలను మహిళలు అందిపుచ్చుకునేలా ప్రభుత్వరంగంలో ఉన్న మనందరం కృషి చేయాలని కోరారు. జిల్లాలో 1/3 వంతు మహిళా అధికారులు పని చేస్తున్నారని, అందరూ బాగా పని చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లడంలో వారి సహకారం ఎంతైన ఉందని అన్నారు. మహిళలు తలచుకుంటే ఏదైన సాధించగలరని అన్నారు.

**విజేతలకు బహుమతులు**

మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన జిల్లా అధికారులకు, ఉత్తమ మహిళా సిబ్బందికి కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, పీడీ డీఆర్డీఏ శ్రీలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి, మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, అడిషనల్ పీడీ సుభాషిణి, డీఎంహెచ్ఓ డాక్టర్ లలిత దేవి, రంగారెడ్డి టీజీవోస్ అసోసియేషన్, ప్రెసిడెంట్ డాక్టర్ రామారావు, శాంతి శ్రీ, రేవతి, అలివేలు, మహేశ్వరి, బాలేశ్వరి, రాణి, జ్యోత్స్న, కలెక్టరేట్ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.



## శిల్పారామంలో అలరించిన కూచిపూడి

**ముద్ర, శేరిలింగంపల్లి:**

శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. కుమారి శాయశ్రీ పాటిల్ భరతనాట్య ప్రదర్శన లో శాంకరి శాంగురు, కాలాయితుకి, కల్యాణ రామ, భాగ్యదా లక్ష్మి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. స్వరాంజలి డాన్స్ అకాడమీ నాట్య గురువులు శ్రీమతి వర్ష రెడ్డి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో ముదకరత మోదకం, నటేశ కౌతం, భో శంభో, కాళీ కౌతం, అష్టలక్ష్మి, అయిగిరినందిని, దశావతరం, తక్కువేమి మనకు మొదలైన అంశాలను కళాకారులూ రమ్య, నికిత, శ్రీకరీ, వర్ణిత, శ్రీనిక, సంజన, సింధూజ, శ్రీనిధి మొదలైన వారు ప్రదర్శించి వీనుల విందు చేశారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ శుభవార్త

- లోన్ వడ్డీ రేట్లు తగ్గింపు
- మరింత తగ్గనున్న ఈఎంఐ!

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన కస్టమర్లకు శుభవార్త అందించింది. మార్చి 6న ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను ఎంపిక చేసిన టెన్యూర్లపై పెంచిన బ్యాంక్.. ఇప్పుడు లోన్ వడ్డీ రేట్లను తగ్గించింది. అన్ని టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ రేట్లు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఎంసీఎల్ఆర్ లింక్డ్ లోన్ ఈఎంఐ తగ్గుతుందని చెప్పొచ్చు. కొత్త రేట్లు మార్చి 7 నుంచే అమల్లోకి వస్తున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అదిరిపోయే శుభవార్త చెప్పింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను (MCLR రుణ ఆధారిత వడ్డీ రేటు) తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఎంసీఎల్ఆర్‌ను అన్ని టెన్యూర్లపైనా తగ్గించింది. కనీసం 5 బేసిస్ పాయింట్ల నుంచి గరిష్ఠంగా 10 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. దీంతో ఈ ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉన్న లోన్ వడ్డీ రేట్లు తగ్గుతాయి. ఇదివరకే ఫ్లోటింగ్ రేటుపై ఎంసీఎల్ఆర్ లింక్డ్ లోన్ తీసుకున్న వారికి ఈఎంఐ తగ్గించుకునే వెసులుబాటు ఉంటుంది లేదా లోన్ టెన్యూర్ తగ్గించుకోవచ్చు. బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం.. ఎంసీఎల్ఆర్ రేట్ల తగ్గింపు మార్చి 7 నుంచి అమలవుతుందని స్పష్టం చేసింది. వడ్డీ రేట్లను సవరించిన తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఇప్పుడు ఎంసీఎల్ఆర్ కనీసం 8.15 శాతం నుంచి గరిష్ఠంగా 8.55 శాతం వరకు ఉంది. అంతకుముందు చూస్తే ఇది 8.25 శాతం నుంచి 8.60 శాతంగా ఉండేవి. ఓవర్ నైట్ అండ్ ఒక నెల ఎంసీఎల్ఆర్ విషయంలో 10 బేసిస్ పాయింట్ల కోత విధించి 8.25 శాతం నుంచి 8.15 శాతానికి చేర్చింది. 3 నెలల ఎంసీఎల్ఆర్‌ను అంతకుముందు 8.30 శాతంగా ఉండగా.. 5 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.25 శాతానికి చేర్చింది. ఇక 6 నెలలు, ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్ అంతకుముందు 8.40 శాతంగా ఉండగా.. ఇప్పుడు 8.35 శాతానికి తగ్గించింది. ఎక్కువగా కన్జూమర్ లోన్లు.. ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్‌తో లింక్ అయి ఉంటాయి. రెండేళ్ల టెన్యూర్ MCLR 8.50 శాతం నుంచి 8.45 శాతానికి దిగొచ్చింది. మూడేళ్ల ఎంసీఎల్ఆర్ 8.60 శాతం నుంచి 8.55 శాతానికి తగ్గించింది.

**FD వడ్డీ రేట్లు పెంపు..**

బ్యాంక్ కిందటి రోజే ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను పెంచి శుభవార్త అందించగా.. ఇవాళ లోన్ వడ్డీ రేట్లు తగ్గించింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 3 సంవత్సరాల ఒక రోజు నుంచి 4 సంవత్సరాల 7 నెలల వ్యవధిపై వడ్డీ రేట్లను సాధారణ ప్రజలకు 6.40 శాతం నుంచి 6.50 శాతానికి పెంచింది. ఇదే సమయంలో సీనియర్ సిటిజెన్లకు చూస్తే 6.90 శాతం నుంచి ఇప్పుడు 7 శాతానికి చేర్చింది.

**MCLR అంటే ఏంటి?**

ఎంసీఎల్ఆర్ అనేది ఏదైనా లోన్‌పై బ్యాంకులు వసూలు చేసే కనీస వడ్డీ రేటుగా చెప్పొచ్చు. ఇంతకంటే తక్కువ వడ్డీకి లోన్ ఇచ్చేందుకు వీల్లేదు. అన్ని బ్యాంకుల్లో ఒకే రూల్ ఉండాలన్న ఉద్దేశంతో ఈ ఎంసీఎల్ఆర్ విధానాన్ని ఆర్బీఐ 2016లో ప్రవేశపెట్టింది. ఈ ఎంసీఎల్ఆర్‌పై అదనంగా బ్యాంకులు కాస్త అధిక వడ్డీ రేట్లు వసూలు చేస్తుంటాయి. ఇక ప్రస్తుత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బేస్ రేటు 8.80 శాతంగా ఉంది. బెంచ్‌మార్క్ పీఎల్ఆర్ (BPLR) 17.30 శాతంగా ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు

**అధిక ఒత్తిడి (స్ట్రెస్)**

ఎక్కువ మానసిక ఒత్తిడి రక్తపోటును పెంచుతుంది. దీని వల్ల మెదడులో రక్తనాళాలు దెబ్బతిని స్ట్రోక్ రావచ్చు.



# టీ20 సమరం : భారత్ vs న్యూజిలాండ్ మధ్య విశ్వవిజేత పోరు

- **అహ్మదాబాద్ వేదికగా భారత్-న్యూజిలాండ్ మధ్య టైటిల్ సమరం**
- **ఐసీసీ ఫైనల్స్‌లో కివీస్ పైచేయి... ప్రతీకారం కోసం టీమిండియా రెడీ**
- **మూడు ఫార్మాట్ల ఫైనల్స్‌లో తలపడిన తొలి జట్లుగా భారత్-కివీస్ రికార్డు**
- **డిఫెండింగ్ ఛాంపియన్‌గా సూర్యకుమార్ యాదవ్ సేనకు మరో సవాల్**
- **శాంట్నర్ నేతృత్వంలోని న్యూజిలాండ్ జట్టు టైటిల్ కోసం గట్టి పోటీ**

టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా భారత జాతీయ క్రికెట్ జట్టు మరియు న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టు జట్లు తలపడుతున్నాయి. వరుసగా రెండోసారి టైటిల్ గెలవాలని భారత్ పట్టుదలగా ఉండగా, ఈ ఫార్మాట్‌లో తొలి ప్రపంచకప్ గెలవాలని న్యూజిలాండ్ లక్ష్యంగా పెట్టుకుంది.
ఇప్పటివరకు ఐసీసీ టోర్నీల ఫైనల్స్‌లో ఈ రెండు జట్లు మూడు సార్లు ఎదురుపడ్డాయి. 200లో జరిగిన ICC ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో న్యూజిలాండ్ భారత్‌పై 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అనంతరం 2021లో జరిగిన ICC వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ 2021లో కూడా కివీస్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. అయితే 2025లో జరిగిన ICC ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ 4 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించి ప్రతీకారం తీర్చుకుంది.
ఇప్పుడు టీ20 ప్రపంచకప్‌లో మరోసారి ఈ రెండు జట్లు తలపడుతుండటంతో మ్యాచ్‌పై భారీ ఆసక్తి నెలకొంది. ఐసీసీ నిర్వహించే మూడు ఫార్మాట్లలో సృష్టించే ఫైనల్స్‌లో ఒకరినొకరు ఎదుర్కొంటున్న తొలి జట్లుగా భారత్, న్యూజిలాండ్ అరుదైన రికార్డ్. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు కెప్టెన్ సూర్య



కుమార్ యాదవ్ మరోసారి టైటిల్ గెలవాలని చూస్తోంది. మరోవైపు కెప్టెన్ మిచెల్ సాంట్నర్ నాయకత్వంలోని న్యూజిలాండ్ జట్టు నిలకడైన ఆటతో భారత్‌కు గట్టి పోటీని కల్పిస్తోంది. అహ్మదాబాద్ వేదికగా ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఎవరు విశ్వవిజేతగా నిలుస్తారో చూడాలి

## 2023 ఫలితం మళ్లీ రిపీట్ అవుతుందా?

2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్ అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనుంది. సెమీఫైనల్లో న్యూజిలాండ్ దక్షిణాఫ్రికాను ఓడించగా, భారత్ ఇంగ్లాండ్‌పై విజయం సాధించి తుది పోరుకు చేరుకుంది.
ఈ మైదానంలో రెండు జట్లు ఇప్పటివరకు ఒకే ఒక్క టీ20 మ్యాచ్ ఆడాయి. 2023లో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ 168 పరుగుల భారీ తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. ఆ పోరులో శుభ్‌మన్ గిల్ 126 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, భారత్ 234 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం భారత బౌలర్లు రాణించడంతో న్యూజిలాండ్ కేవలం 66 పరుగులకే ఆలౌట్ అయింది.
అయితే ఐసీసీ టోర్నీల్లో న్యూజిలాండ్ భారత్‌కు గట్టి ప్రత్యర్థిగా నిలిచింది. ముఖ్యంగా టీ20 ప్రపంచకప్‌లో ఇప్పటి వరకు భారత్ కివీస్‌ను ఓడించలేదు. ఈ నేపథ్యంలో అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌లో 2023 ఫలితాన్ని భారత్ మళ్లీ పునరావృతం చేస్తుందా? లేక న్యూజిలాండ్ ప్రతీకారం తీర్చుకుంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

## టీమిండియాలో అందరితోనూ ప్రమాదమే: శాంట్నర్

అహ్మదాబాద్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు ముందు న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్-న్యూజిలాండ్ మధ్య జరిగే ఈ తుదిపోరు హై స్కోరింగ్ మ్యాచ్ అయ్యే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డాడు. పిచ్‌ను ఇంకా దగ్గరగా పరిశీలించలేదని, ప్రస్తుతం అది కవర్ల కింద ఉన్నప్పటికీ ఫ్లాట్‌గా ఉండే అవకాశం ఉందని చెప్పాడు. భారత జట్టులో జస్‌ప్రీత్ బుమ్రా అత్యంత ప్రమాదకర బౌలర్ అని శాంట్నర్ పేర్కొన్నాడు. ఈ ప్రపంచకప్‌లో అతడు అద్భుతంగా బౌలింగ్ చేశాడని, ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో కూడా కీలక పాత్ర పోషించాడని గుర్తుచేశాడు. ఫైనల్‌లో అతడిని ఎదుర్కోవడం సవాల్‌గా ఉంటుందని అన్నాడు.
అయితే కేవలం బుమ్రానే కాకుండా భారత జట్టులోని ప్రతి ఆటగాడూ ప్రమాదకరమేనని శాంట్నర్ స్పష్టం చేశాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించడం వల్లే టీమిండియా ఫైనల్‌కు చేరుకుందని, అందుకే ప్రతి ఆటగాడిని జాగ్రత్తగా ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నాడు.

## ఫైనల్ తర్వాత సూర్య రిటైర్మెంట్?

- **టీమ్ ఇండియా కెప్టెన్‌పై చర్చ**

టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఆదివారం న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. సొంత గడ్డపై అభిమానుల మద్దతుతో కప్పు గెలిచే అవకాశాలు భారత్‌కే ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో మ్యాచ్ అనంతరం టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకవచ్చనే ప్రచారం కూడా చర్చనీయాంశంగా మారింది.
ప్రస్తుతం 35 ఏళ్ల సూర్యకుమార్ యాదవ్ టెస్టుల్లో ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడాడు. ఒక దశలో వన్డే జట్టులో ఉన్నప్పటికీ 2023 ప్రపంచకప్ తర్వాత ఆ ఫార్మాట్ నుంచి తప్పుకున్నాడు. అప్పటి నుంచి అతను ప్రధానంగా టీ20లకే పరిమితమయ్యాడు.
టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్ కావడంతో టీ20 జట్టు కెప్టెన్సీ బాధ్యతలు సూర్యకు వచ్చాయి. అతని సారథ్యంలో భారత్ సిరీస్‌ల్లో మంచి ఫలితాలు సాధించింది.
అయితే కెప్టెన్ అయిన తర్వాత అతని వ్యక్తిగత ప్రదర్శన మాత్రం అంతగా ఆకట్టుకోలేదు. కెప్టెన్సీకి ముందు 68 మ్యాచ్‌ల్లో 2300కి పైగా పరుగులు చేసిన సూర్య, ఆ తర్వాత 41 మ్యాచ్‌ల్లో తక్కువ సగటుతోనే పరుగులు చేశాడు. ప్రస్తుత ప్రపంచకప్‌లో అమెరికాపై కీలకమైన 84 పరుగుల ఇన్నింగ్స్ ఆడినా, మిగతా మ్యాచ్‌ల్లో పెద్దగా రాణించలేకపోయాడు.



ఈ నేపథ్యంలో భారత్ ఫైనల్ గెలిస్తే సూర్యకుమార్ యాదవ్ ప్రపంచకప్ విజయంతో కెరీర్‌కు ముగింపు పలకవచ్చని కొందరు భావిస్తున్నారు. ఒకవేళ భారత్ ఓడిపోతే మాత్రం అతని కెప్టెన్సీ, జట్టులో స్థానం రెండూ ప్రశ్నార్థకంగా మారే అవకాశముంది. అలాంటి పరిస్థితిలో అతడే స్వయంగా రిటైర్మెంట్ ప్రకటించే అవకాశ ముందనే చర్చ జరుగుతోంది.

## ఫైనల్‌కు భారత్–న్యూజిలాండ్ సిద్ధం

# టీ20ల్లో ఎవరిది పైచేయి..?

టీ20 ప్రపంచకప్ 2026 తుదిపోరు ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టోర్నీలో అడుగు పెట్టిన టీమిండియా కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే ఫైనల్‌కు చేరుకుంది. జట్టులో కొన్ని విభాగాల్లో స్థిరత్వం లేకపోవడం భారత శిబిరాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం, వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో ప్రభావం చూపలేకపోవడం, శివమ్ దూబే బంతితో ఎక్కువ పరుగులు ఇవ్వడం వంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి.
సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై భారత్ భారీ స్కోరు చేసినప్పటికీ కేవలం 7 పరుగుల తేడాతో మాత్రమే విజయం సాధించింది. ఇది జట్టు బౌలింగ్‌పై కొంత సందేహాలు రేకెత్తిస్తోంది.
మరోవైపు న్యూజిలాండ్ మాత్రం సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై భారీ విజయం సాధించి పూర్తి ఆత్మవిశ్వాసంతో ఫైనల్‌లోకి అడుగుపెట్టింది.
టీ20ల్లో భారత్, న్యూజిలాండ్ జట్లు ఇప్పటివరకు మొత్తం 30 సార్లు తలపడ్డాయి. వీటిలో భారత్ 18 మ్యాచ్‌లు గెలిచి ఆధిక్యం సాధించగా, న్యూజిలాండ్ 11 మ్యాచ్‌ల్లో



విజయం సాధించింది. ఒక మ్యాచ్ టైగా ముగిసింది. స్వదేశంలో జరిగిన మ్యాచ్‌ల్లో భారత్ 11 విజయాలు నమోదు చేయగా, కివీస్ 4 మ్యాచ్‌ల్లో మాత్రమే గెలిచింది. న్యూజిలాండ్ గడ్డపై భారత్ 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, భారత గడ్డపై న్యూజిలాండ్ 5 సార్లు గెలిచింది. తటస్థ వేదికల్లో కివీస్ రెండు మ్యాచ్‌లు గెలిచింది.
అయితే టీ20 ప్రపంచకప్ విషయానికి వస్తే పరిస్థితి కొంత భిన్నంగా ఉంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు భారత్, న్యూజిలాండ్ మూడు సార్లు తలపడగా మూడు సందర్భాల్లోనూ కివీస్ విజయం సాధించింది. ఈ ఫార్మాట్‌లో న్యూజిలాండ్‌పై భారత్ చేసిన అత్యధిక స్కోరు 180 కాగా, అత్యల్ప స్కోరు 79. అదే సమయంలో భారత్‌పై న్యూజిలాండ్ అత్యధికంగా 190 పరుగులు చేయగా, అత్యల్పంగా 111 పరుగులు నమోదు చేసింది.
టీ20 ప్రపంచకప్‌లో ఇప్పటివరకు కివీస్ జట్టుకే పైచేయి ఉన్నప్పటికీ ఈసారి ఫైనల్‌లో భారత్ గెలిచి ఆ రికార్డును మార్చాలని అభిమానులు ఆశిస్తున్నారు. అంతేకాదు వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి కొత్త చరిత్ర సృష్టించాలని టీమిండియా లక్ష్యంగా పెట్టుకుంది.



## మహిళల హాకీకి హైదరాబాద్‌లో మహత్తర ఏర్పాట్లు

- **అంతర్జాతీయ టోర్నీలకు కేరాఫ్‌గా గచ్చిబౌలి**
- **తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి**

**ముద్ర, హైదరాబాద్ :**

మహిళల హాకీ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటూ అంతర్జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తోంది. మహిళల హాకీకి ప్రోత్సాహం కల్పించేందుకు అద్భుతమైన ఏర్పాట్లు చేశామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు.
అంతర్జాతీయ మహిళల హాకీ టోర్నమెంట్ నేపథ్యంలో గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న ఎనిమిది జట్ల కెప్టెన్లతో కలిసి మీడియాతో మాట్లాడిన జితేందర్ రెడ్డి, జాతీయ క్రీడ అయిన హాకీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే ఉద్దేశంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వరల్డ్ మహిళల హాకీ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు.
ప్రభుత్వం నుంచి లభిస్తున్న సహకారంతో జాతీయ ఫెడరేషన్లే కాకుండా అంతర్జాతీయ క్రీడా సమాఖ్యల దృష్టిని కూడా హైదరాబాద్ ఆకర్షిస్తోందని ఆయన అన్నారు. ఈ టోర్నమెంట్ విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.
స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, గచ్చిబౌలి హాకీ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేశామని చెప్పారు. ఈ పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేశామని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.
తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ గత రెండు నెలలుగా నిరంతరం శ్రమించి ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సిద్ధమైందని ఆమె తెలిపారు.
ఈ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఎనిమిది జట్ల కెప్టెన్లు కూడా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ ఆతిథ్యం మరియు సహకారానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. గచ్చిబౌలి ఆస్ట్రో టర్ఫ్‌లో జరిగే ఈ పోటీలు అద్భుతమైన హాకీకి వేదిక కాబోతున్నాయని వారు అభిప్రాయపడ్డారు.



## చార్టర్ విమానాల్లో స్వదేశాలకు క్రికెట్ జట్లు

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల తర్వాత అంతర్జాతీయ గగనతలంలో ఏర్పడిన అంతరాయాల కారణంగా భారత్‌లో ఉన్న కొన్ని జట్లు స్వదేశాలకు వెళ్లడంలో ఆలస్యం ఎదుర్కొన్నాయి. దీంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రత్యేక చార్టర్ విమానాలను ఏర్పాటు చేసింది.
టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో భారత్ చేతిలో ఓడిన ఇంగ్లాండ్ జట్టు శనివారం ముంబై నుంచి లండన్‌కు బయలుదేరే అవకాశం ఉంది. టోర్నీ నుంచి నిష్క్రమించిన దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు కోల్‌కతా నుంచి ప్రత్యేక విమానంలో ప్రయాణించనున్నాయి. ముందుగా జోహన్నెస్‌బర్గ్‌కు వెళ్లి, అక్కడి నుంచి వెస్టిండీస్ జట్టు ఆంటిగ్వాకు చేరనుంది.
విమానాల ఖచ్చితమైన సమయాలు ఇంకా ఖరారు కాలేదు. ఎయిర్ ట్రాఫిక్ అనుమతుల ఆధారంగా ఆదివారం ప్రయాణం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. గగనతల పరిమితుల కారణంగా నాలుగు రోజులుగా భారత్‌లోనే ఉన్న వెస్టిండీస్ జట్టును స్వదేశానికి తరలించేందుకు ప్రత్యేక విమానం ఏర్పాటు చేసినట్లు క్రికెట్ వెస్టిండీస్ తెలిపింది.

## ఫైనల్‌కు కీలకం పిచ్..

### అహ్మదాబాద్‌లో ఎలా ఉండబోతోంది?

అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్-న్యూజిలాండ్ మధ్య జరగనున్న టీ20 ప్రపంచకప్ ఫైనల్‌పై ఉత్కంఠ పెరిగింది. ఈ మ్యాచ్‌లో జట్ల వ్యూహాలతో పాటు పిచ్ కూడా కీలక పాత్ర పోషించనుందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. నరేంద్రమోదీ స్టేడియం పిచ్‌లు సాధారణంగా ఎర్రమట్టి, నల్లమట్టి లేదా హైబ్రిడ్ మిశ్రమంతో ఉంటాయి. నల్లమట్టి పిచ్‌లు కొంత నెమ్మదిగా ఉండగా, ఎర్రమట్టి పిచ్‌లలో బౌన్స్, వేగం ఎక్కువగా ఉండటం వల్ల బ్యాటర్లకు అనుకూలంగా మారుతుంది. ఫైనల్ కోసం ఎర్రమట్టి, నల్లమట్టి మిశ్రమంతో ఉన్న హైబ్రిడ్ పిచ్‌ను ఉపయోగించే అవకాశం ఉందని సమాచారం.
ఇలాంటి పిచ్‌లు సాధారణంగా సమతుల్యంగా ఉండి బ్యాటర్లు, బౌలర్లకు రెండింటికీ సహకరిస్తాయి. మ్యాచ్ సాగుతున్న కొద్దీ బౌలర్లకు కొంత పట్టుతో పాటు బ్యాటర్లకు షాట్లు ఆడేందుకు మంచి వేగం అందిస్తాయని భావిస్తున్నారు. ఈ టోర్నీలో ఆ పిచ్‌పై ఇప్పటికే కెనడా-దక్షిణాఫ్రికా మధ్య ఒక మ్యాచ్ మాత్రమే జరిగింది. ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 213 పరుగుల భారీ స్కోరు చేయడంతో ఈసారి కూడా హై స్కోరింగ్ మ్యాచ్ జరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. పిచ్ పరిస్థితులను బట్టి చూస్తే భారత ఫాస్ట్ బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్ కొత్త బంతితో ప్రమాదకరంగా మారే అవకాశముంది. బౌన్స్ ఉన్న పిచ్‌లపై బుమ్రా బౌలింగ్ ప్రభావం చూపగలదు. స్పిన్ విభాగంలో వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. మరోవైపు న్యూజిలాండ్‌కు మ్యాట్ హెన్రీ, లాకీ ఫెర్గూసన్ వంటి బౌలర్లు ఉండటం వల్ల బౌన్స్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 08.03.2026
www.mudranews.in | @mudranews



**బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలు**

వయస్సు పెరగడంవయస్సు పెరిగే కొద్దీ రక్తనాళాలు బలహీనపడతాయి. అందువల్ల పెద్దవారిలో స్ట్రోక్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది...



# గద్దర్ అవార్డుల ప్రకటన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ ప్రభుత్వం 2025వ సంవత్సరానికి గద్దర్ అవార్డ్స్ అనౌన్స్ చేసింది. తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజుతో పాటు సభ్యులు ఈ అవార్డులు అనౌన్స్ చేశారు. స్పెషల్ జ్యూరీ అవార్డులను తమ్మారెడ్డి భరద్వాజ అనౌన్స్ చేశారు. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకూ CBFC ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలు, షార్ట్ ఫిల్మ్స్‌కు ఈ అవార్డ్స్ ప్రకటించారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఈ నెల 19న అవార్డులు ప్రధానం చేయనున్నారు. చిన్న సినిమాగా వచ్చి సంచలన విజయం సాధించిన మూవీ రాజు వెడ్స్ రాంబాయి ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ హీరోగా నాగ చైతన్య (తండేల్), హీరోయిన్‌గా రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్) నిలిచారు.




స్పెషల్ జ్యూరీ అవార్డుల్లో మెగాస్టార్ చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ అవార్డు వరించింది.

**ఫీచర్ ఫిల్మ్స్**

| | |
|---|---|
| బెస్ట్ మూవీ | రాజు వెడ్స్ రాంబాయి |
| బెస్ట్ సెకండ్ మూవీ | దండోరా |
| బెస్ట్ థర్డ్ మూవీ | ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో |
| బెస్ట్ యాక్టర్ | నాగ చైతన్య (తండేల్) |
| ఉత్తమ నటి | రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్) |
| బెస్ట్ డైరెక్టర్ | సాయిలు కంపాటి (రాజు వెడ్స్ రాంబాయి) |
| బెస్ట్ డాక్యుమెంటరీ | యూనిటీ |
| బెస్ట్ ఎంటర్టైన్మెంట్ మూవీ | సంక్రాంతికి వస్తున్నాం |
| బెస్ట్ చైల్డ్ మూవీ | అనగనగా |
| బెస్ట్ సోషల్ మెసేజ్ మూవీ | కోర్ట్ |
| బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ నేషనల్ ఇంటిగ్రేషన్ | తండేల్ |
| ఉత్తమ సహాయ నటుడు | శివాజీ |
| ఉత్తమ సహాయ నటి | భూమిక (యుఫోరియా) |
| బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ | మార్క్ రాబిన్ (దండోరా) |
| బెస్ట్ మేల్ సింగర్ | అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి) |
| బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ | మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో) |
| బెస్ట్ ఫీమేల్ సింగర్ | సాహితీ (కన్నప్ప) |
| బెస్ట్ లిరిసిస్ట్ | నంద కిశోర్ (కుబేర - పచ్చ పచ్చని చేలల్లో) |
| బెస్ట్ ఎడిటర్ | శ్రీకర ప్రసాద్ (మిరాయ్) |
| బెస్ట్ స్క్రీన్ ప్లే | అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం) |
| బెస్ట్ స్టోరీ రైటర్ | గుణశేఖర్ (యుఫోరియా) |
| బెస్ట్ సినిమాటోగ్రాఫర్ | కార్తీక్ ఘట్టమనేని (మిరాయ్) |
| బెస్ట్ పర్యావరణ చిత్రం | ఇగ్వా |
| బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్స్ మూవీ | మిరాయ్ |
| బెస్ట్ డెబ్యూ ఫీచర్ ఫిల్మ్ | లిటిల్ హార్ట్స్ |
| బెస్ట్ కామెడీ యాక్టర్ | శ్రీకృష్ణ తేజ (జిగ్రీస్) |
| బెస్ట్ ఆడియోగ్రాఫర్ | ఎం ఆర్ రాధాకృష్ణన్ (కిష్కింధపురి) |
| బెస్ట్ కొరియోగ్రాఫర్ | ఆట సందీప్ (గిర గిర గింగిరా గిరే - ఛాంపియన్) |
| బెస్ట్ ఆర్ట్ డైరెక్టర్ | తోట తరణి (ఛాంపియన్) |
| బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్ | గోవింద్ (అఖండ) |
| బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ | చంద్రకాంత్ (ఛాంపియన్) |
| బెస్ట్ స్పెషల్ జ్యూరీ మూవీ | 23 |
| స్పెషల్ జ్యూరీ హీరో | రోషన్ (ఛాంపియన్) |

**ఉత్తమ చిత్రంగా 'రాజు వెడ్స్ రాంబాయి'**
**ఉగాది రోజున పురస్కారాల ప్రదానోత్సవం**
**ఉత్తమ నటీనటులుగా నాగ చైతన్య, రష్మిక**
**మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం**
**దిగ్గజాలకు గౌరవ పురస్కారాల ప్రకటన**
**సాంకేతిక విభాగాల్లో సత్తా చాటిన చిత్రాలు**

**స్పెషల్ జ్యూరీ అవార్డులు**

ఎన్టీఆర్ నేషనల్ అవార్డు - మెగాస్టార్ చిరంజీవి
సినారె అవార్డు - ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ
పైడి జయరాజ్ అవార్డ్ - యూనివర్సల్ హీరో కమల్ హాసన్
అక్కినేని నాగేశ్వరరావు అవార్డు - జయసుధ
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ కైవసం చేసుకున్నారు.
బిఎన్ రెడ్డి అవార్డు - సింగీతం శ్రీనివాసరావు
కాంతారావు అవార్డు - ఆర్ నారాయణమూర్తి



## భగవత్ గీత.. భగత్ గీత..

**ఇవేమి డైలాగ్స్ బాబోయ్..!**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుని ఉగాది సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానుంది. ప్రస్తుతం చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది.ఈ నేపథ్యంలో మూవీ ట్రైలర్ టీజ్‌ను విడుదల చేశారు. చిన్న వీడియోగా వచ్చిన ఈ టీజ్‌లో పవన్ కళ్యాణ్ చెప్పిన డైలాగ్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తుండగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. పవన్ కళ్యాణ్ – హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి

> **"ఇందాక విన్నది భగవద్గీత...**
> **ఇది భగత్ గీత...**
> **దమ్మున్నోడు దాటొచ్చు..."**
>
> **అనే పవన్ డైలాగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. త్వరలో పూర్తి ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.**

## 'ధురంధర్ 2' ట్రైలర్.. యాక్షన్ పవర్ ప్యాక్డ్

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన 'ధురంధర్' చిత్రం గత ఏడాది చివర్లో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమాకు కొనసాగింపుగా 'ధురంధర్: ది రివెంజ్' పేరుతో రెండో భాగాన్ని తీసుకువస్తున్నారు. ఈ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం కేవలం హిందీ భాషలోనే విడుదల కాగా, ఈసారి సీక్వెల్‌ను హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సినిమా విడుదలకు ముందు ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం తాజాగా ట్రైలర్‌ను ప్రేక్షకులతో పంచుకుంది. ఈ ట్రైలర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది.



## విడాకులపై స్పందించిన హీరో విజయ్

సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ తనపై వస్తు న్న వివాదాలపై స్పందించారు. ఆ విషయాల వల్ల అభిమానులు, ప్రజలు ఇబ్బంది పడు తుంటే తనకు బాధగా ఉందని అన్నారు. చెన్నై సమీపంలోని చెంగల్పట్టులో మహిళా దినోత్సవం సందర్భంగా టీవీకే నిర్వహించి న కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పార్టీ కార్యకర్తలకు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యక్తిగత విషయాలను తానే చూసుకుంటానని స్పష్టం చేశారు. అదే సమయంలో మహిళల కోసం ప్రత్యేక హామీలతో కూడిన మేనిఫెస్టోను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన విజయ్, తనకు ఎదురవుతున్న వ్యక్తిగత సమస్యల గురించి కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆ అంశాలపై ఎవరూ పోరాటాలు చేయాల్సిన అవసరం లేదని, వాటిని తానే పరిష్కరించుకుంటానని చెప్పారు. కార్యకర్తలు మాత్రం ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు.

ఇదిలా ఉండగా విజయ్ భార్య సంగీత తాజాగా కోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. విడాకుల కేసు ముగిసే వరకు చెన్నైలోని విజయ్ ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇవ్వాలని కోర్టును కోరారు. నీలంగరైలోని ఇంట్లో ఉండేందుకు అనుమతి కోరగా తనను లాయర్ ద్వారా బెదిరిస్తున్నారని ఆరోపించారు. వివాహ బంధానికి విజయ్ ద్రోహం చేశారని పేర్కొంటూ ఆమె ఫిబ్రవరి 24న విడాకుల పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుపై విచారణ ఏప్రిల్ 20న జరగనుండగా, ఆ రోజున కోర్టుకు హాజరుకావాలని విజయ్‌కు నోటీసులు జారీ అయ్యాయి.

## పెళ్లయినా అందాలు తగ్గని ప్రణీత

దాదాపు 15 ఏళ్లుగా సినీ రంగంలో కొనసాగుతున్న ప్రణీత సుభాష్ దక్షిణాది చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల ఇద్దరు కుమారులకు తల్లిగా మారిన ఆమె జీవితంలో పెద్ద మార్పులు వచ్చినా, గ్లామర్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని తాజా ఫొటోలు చెబుతున్నాయి.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ చిత్రాల్లో ప్రణీత డీప్ బ్లూ రంగు ఆఫ్ షోల్డర్ గౌన్‌లో కనిపించారు. పొడవైన కిటికీ పక్కన నిలబడి తీసిన ఈ ఫొటోలలో ఆమె స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సింపుల్ మేకప్, లూజ్ హెయిర్ స్టైల్‌తో ఆమె అందంగా మెరిసింది.



## 'గాయపడ్డ సింహాం' థీమ్ సాంగ్ విడుదల

దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ వరుస ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'గాయపడ్డ సింహం: Vol 1.5'. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో కొనసాగుతోంది. సినిమా ప్రమోషన్లలో భాగంగా శనివారం చిత్ర బృందం థీమ్ సాంగ్‌ను విడుదల చేసింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాల ప్రభావం ఒక యువకుడి జీవితంపై ఎలా పడింది? అతను ఎదుర్కొన్న సమస్యలు ఏమిటి? అనే అంశాల చుట్టూ కథ సాగుతుందని సమాచారం. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితాలను ప్రతిబింబించేలా కథను రూపొందించినట్లు తెలుస్తోంది. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.





## బ్లాక్ డ్రెస్‌లో మృణాల్ అందాల విందు

నటి మృణాల్ థాకూర్ తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. నలుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో ఆమె సొగసుగా మెరిసింది. ఈ ఫొటోలలో మృణాల్ అందమైన ఎంబ్రాయిడరీ పనితో ఉన్న బ్లౌజ్, పొడవైన స్కర్ట్, దుపట్టాతో కనిపించారు. సంప్రదాయ శైలికి ఆధునిక టచ్ కలిసిన ఈ డ్రెస్‌లో ఆమె లుక్ ప్రత్యేకంగా నిలిచింది. సింపుల్ మేకప్, ఆకర్షణీయమైన పోజులతో ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశారు.ఇక మృణాల్ నటిస్తున్న తాజా చిత్రం 'డాకాయిట్: ఎ లవ్ స్టోరీ'లోని 'రూబరూ' పాట ఇటీవల విడుదలై మంచి స్పందన అందుకుంది. ఈ సినిమాలో అడివి శేష్ హీరోగా నటిస్తున్నారు. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com